



టీడీపీ, జనసేన శ్రేణుల్లో జోష్!



సభలో మాట్లాడుతున్న చంద్రబాబు (ఫైల్ ఫొటో)

నూతనోత్తేజం నింపిన చంద్రబాబు ప్రసంగం

- కేరింతలతో మద్దతు తెలిపిన జనం
- గొండుపాలెం 'రా.. కదలిరా!' సభ సక్సెస్‌తో ఇరు పార్టీల నేతలు ఖుషీ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 'రా.. కదలిరా!' నినాదంతో నిర్వహిస్తున్న బహిరంగ సభలు టీడీపీ, జనసేన శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయి. సోమవారం మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం గొండుపాలెంలో నిర్వహించిన సభకు భారీ ఎత్తున జనం హాజరు కావడంతో జిల్లాకు చెందిన ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉబ్బితబ్బిబ్బు అవుతున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా చంద్రబాబునాయుడు పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేస్తూనే మరోవైపు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికే 'బాదుడే బాదుడు', 'బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ' వంటి కార్యక్రమాలతో ప్రజలకు చేరువైన టీడీపీ శ్రేణులు.. తాజాగా 'రా కదలిరా!' నినాదంతో నిర్వహించిన బహిరంగ సభకు అశేషంగా జనం తరలి రావడంతో చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండు గంటలపాటు సాగిన చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని చివర వరకు జనం ఆసక్తిగా వినడాన్ని గమనించారు. వైసీపీ పాలనతో జనం విసిగిపోయి వున్నారని, వచ్చేఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి మద్దతు ఇవ్వాలని ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశారని అంటున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కలిసి పోటీ చేయాలని నిర్ణయించిన తరువాత తొలిసారి జిల్లాలో జరిగిన చంద్రబాబు సభ.. ఇరు పార్టీల కార్యకర్తలు, నాయకులు ఐకమత్యంతో పనిచేయడంతో విజయవంతమైంది. ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులతోపాటు మద్దతుదారులు, సానుభూతిపరులు బహిరంగ సభకు హాజరయ్యేలా చేసిన కృషి ఫలించిందని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు దిశానిర్దేశం

గొండుపాలెం సభలో టీడీపీ, జనసేన శ్రేణులకు టీడీపీ అధినేత దిశానిర్దేశం చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ అరాచక పాలనకు చరమగీత పాడేందుకు ఎటువంటి భేషిజాలకు పోకుండా కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ప్రజలకు ప్రశ్నలు సంధిస్తూ ప్రసంగం సాగించారు. బటన్ నొక్కి, బొక్కుడు సంగతి చెప్పని జగన్‌ను ఓడించేందుకు రానున్న ఎన్నికల్లో ప్రతి ఓటరూ ఓటు అనే బటన్‌ను నొక్కి వైసీపీని ఇంటికి సాగనంపేందుకు సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాల గురించి చంద్రబాబు పూసగుచ్చినట్టు వివరించడాన్ని సభకు హాజరైన ప్రజలు శ్రద్ధగా ఆలకించారు. వైసీపీ నాలుగున్నరేళ్ల అరాచక పాలనను ఎండగడుతూ సాగిన చంద్రబాబు ప్రసంగానికి జనం కేరింతలతో తమ మద్దతు తెలిపారు. మొత్తం మీద గొండుపాలెం సభ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన గెలుపునకు బాటలు వేస్తుందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నది.

ఏసీబీ వలలో గొలగాం పంచాయతీ కార్యదర్శి

ఆస్తి పన్ను పేరు మార్చడానికి రూ.7 వేలు లంచం డిమాండ్

- డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 6: ఇంటి పన్నుకు సంబంధించి పేరు మార్చడానికి లంచం తీసుకుంటూ అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఇందుకు సంబంధించి ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.



ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి కొసిరెడ్డి కనకబాబు

గొలగాం గ్రామానికి చెందిన తోట ఈశ్వరరావు ఇటీవల ఇటీవల మృతిచెందాడు. ఇతని పేరున గ్రామంలో ఇల్లు ఉంది. తన తండ్రి పేరున ఉన్న ఆస్తి పన్నును తన పేర్ల మీదకు మార్చాలని ఈశ్వరరావు కుమారుడు బాబ్జీ ఇటీవల పంచాయతీ కార్యదర్శి కొసిరెడ్డి కనకబాబును కలిసి కోరారు. ఈ పని చేయాలంటే తనకు రూ.10 వేలు లంచం ఇవ్వాలని, లేకపోతే పేర్లు మార్చడం కుదరదని కార్యదర్శి స్పష్టం చేశాడు. దీంతో బాబ్జీ అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించి, పంచాయతీ కార్యదర్శి లంచం డిమాండ్ చేసిన విషయమై ఫిర్యాదు చేశారు. ఏసీబీ అధికారులు చెప్పిన మేరకు బాబ్జీ మంగళవారం ఉదయం పదిన్నర గంటలకు పంచాయతీ కార్యదర్శి కనకబాబుకు ఫోన్ చేసి, ఆస్తి పన్ను పేర్లు మార్చడానికి రూ.7 వేలు ఇస్తానని, డబ్బులు ఎక్కడకు వచ్చి ఇవ్వాలని అడిగారు. పంచాయతీ కార్యాలయంలోనే వున్నానని అతను చెప్పడంతో బాబ్జీ అక్కడకు వెళ్లారు. రూ.7 వేలు ఇస్తుండగా అప్పటికే సమీపంలో మాటువేసిన ఏసీబీ డీఎస్పీ రమ్య, ఇతర అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కార్యదర్శి టేబుల్ డ్రాలో అనధికార నగదు రూ.10 వేలు ఉన్నట్టు గుర్తించి ఆ సొమ్మును కూడా స్వాధీనం చేసుకున్నారు. కార్యదర్శి కనకబాబును సాయంత్రం వరకు విచారించి అనంతరం తమ వెంట తీసుకెళ్లారు.

అడ్డగోలుగా ఎల్‌పీసీలు

అధికార పార్టీ నేతలతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కు

- జగనన్న కాలనీలకు సమీపంలోని ప్రభుత్వ భూములే లక్ష్యం
- పేదల ఆధీనంలో ఉన్నట్టు రెవెన్యూ శాఖకు దరఖాస్తులు
- రెండేసి సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలకు ఎల్‌పీసీలు జారీ చేయాలని వినతి
- ఒక్కో ఎల్‌పీసీకి రూ.20-25 వేల వరకు లంచం
- గ్రామస్థాయి నుంచి మండల స్థాయి అధికారి వరకు వాటాలు
- సెంటు రూ.లక్ష నుంచి రెండు లక్షలకు అమ్ముకుంటున్న వైసీపీ నేతలు
- ఎన్నికల బదిలీల నేపథ్యంలో పాత తేదీలతో ఫైళ్లు



తగరంపూడి సర్వే నంబరు 60లో వున్న ప్రభుత్వ స్థలంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లా రెవెన్యూ శాఖలో కొందరు అధికారులు ప్రతి పనికి ఓ రేటు పెట్టేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. లంచాలకు కక్కుర్తిపడి ప్రభుత్వ భూములకు అడ్డగోలుగా ల్యాండ్ పొజిషన్ ధ్రువీకరణ పత్రాలు (ఎల్‌పీసీలు) జారీ చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇటీవల జిల్లా నుంచి బదిలీ అయిన తహసీల్దార్లలో పలువురు బాధ్యతలు అప్పగించి వెళ్లే ముందు వందల సంఖ్యలో ఎల్‌పీసీల జారీకి సంతకాలు చేసేట్టు ఫిర్యాదులు అందుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా జారీ అవుతున్న ఎల్‌పీసీల వ్యవహారంలో రెవెన్యూ సిబ్బంది తమ చేతికి అవినీతి మట్టి అంటకుండా స్థానిక అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై వ్యవహారాలు నడుపుతున్నారు. జగనన్న కాలనీలకు సమీపంలో ప్రభుత్వ భూములు, కొండ పోరంబోకు భూములను అధికార వైసీపీ నాయకులు తమ గుప్పిట్లో పెట్టుకొంటున్నారు. సామాజిక అవసరాలకు వినియోగించాలిన ఈ భూములను.. రూ.లక్షలు దండుకొని అనర్హులకు కట్టబెడుతున్నారు.

పేదలకు ఇంటి స్థలం మంజూరు చేయాలంటే తొలుత గృహనిర్మాణ సంస్థ అధికారుల నుంచి స్థానిక తహసీల్దారు కార్యాలయానికి నివేదిక పంపాలి. సదరు స్థలం ఇంటి నిర్మాణం చేపట్టబోయే లబ్ధిదారుడి ఆధీనంలో గత కొన్నేళ్లుగా ఉన్నట్టు స్థానిక వీఆర్‌ఓ, గ్రామ కార్యదర్శి ధ్రువీకరించాలి. ఆ తరువాత తహసీల్దారు ఎల్‌పీసీ జారీ చేయాలి. కానీ జిల్లాలోని పలు మండలాల్లో తహసీల్దార్లు, దిగువస్థాయి సిబ్బంది.. స్థానిక అధికార పార్టీ నాయకులతో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకొని సదరు నేతలు సిఫారసు చేసిన వ్యక్తుల పేర్ల మీద ఎల్‌పీసీలు జారీ చేస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది ఒక్కో ఎల్‌పీసీ జారీకి వైసీపీ నాయకుల నుంచి రూ.20 వేలు నుంచి రూ.25 వేల వరకు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మొత్తాన్ని గ్రామ కార్యదర్శి, వీఆర్‌ఓ, ఆర్‌ఐ, డీటీ, సర్వేయర్ దగ్గర నుంచి తహసీల్దారు వరకు వారి వారి స్థాయిలనుబట్టి వాటాలు పంచుకుంటున్నట్టు తెలిసింది. అనంతరం స్థానికంగా వున్న డిమాండ్, మార్కెట్ ధరలనుబట్టి సెంటు రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు వైసీపీ నేతలు అనధికారికంగా అమ్ముకుంటున్నారు



అనకాపల్లి తహసీల్దారు కార్యాలయం

బదిలీల సందడిలో కదులుతున్న ఫైళ్లు

ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచి పలువురు తహసీల్దార్లు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు బదిలీ అయ్యారు. దీంతో ఇక్కడ రిలీవ్ కాకముందు కొంత మంది తహసీల్దార్లు, వైసీపీ నాయకులతో కుమ్మక్కై పాత తేదీలు వేసి ఎల్‌పీసీలు జారీ చేసేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. జిల్లా కేంద్రం వున్న అనకాపల్లి మండలంలో ఈ తరహా ఎన్‌ఓసీల జారీ అధికంగా జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనకాపల్లి మండలం శంకరం, సత్యనారాయణపురం, రేబాక, గొలగాం, భట్లపూడి, తగరంపూడి, సిరసపల్లి పరిసరాల్లో జగనన్న కాలనీలకు సమీపంలో పెద్దఎత్తున ఎల్‌పీసీలు జారీ చేసేందుకు రెవెన్యూ అధికారులు రికార్డులు సిద్ధం చేసినట్టు సమాచారం. తగరంపూడిలో సర్వే నంబరు 60లో వున్న ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా వేసి విక్రయించిన స్థానిక నాయకుడు ఒకరు.. ఆయా స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు పునాదులు వేయించారు. అనకాపల్లి మండలంలోనే కాకుండా జిల్లాలోని పలు మండలాల్లో పాత తేదీలతో ఎల్‌పీసీల జారీకి ఫైళ్ల సిద్ధం చేసి, ఆర్డీఓల ఆమోదం కోసం పంపినట్టు తెలిసింది.

ఇదిలావుండగా అనకాపల్లి నియోజకవర్గం పరిధిలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఒక రెవెన్యూ అధికారి సుమారు 500 ఎల్‌పీసీలపై సంతకాలు చేసినట్టు టీడీపీ అనకాపల్లి మండల మాజీ అధ్యక్షుడు బొడ్డపాటి రాజారావు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములను కాపాడాలని ఆయన కోరారు.



కోడి పందేలు వద్ద కోలహలం

గోకులపాడులో జూదాల జోరు!

గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

- ఇదే అదనుగా కోడి పందేలు, గుల్లాటలు
- పోలీసులకు మామూళ్ల పేరుతో నిర్వాహకుల నుంచి రూ.60 వేలు వసూలు?
- పట్టించుకోని బందోబస్తు పోలీసులు





జోరుగా సాగుతున్న గుల్లాట (ఇన్‌సెట్‌లో) చర్చి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పోలీసులు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 6: మండలంలోని గోకులపాడులో మంగళవారం పెద్దఎత్తున కోడి పందేలు, గుల్లాటలు నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఇదే అదనుగా భావించిన జూదరులు కోడిపందేలు, గుల్లాటలు నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు ఆ ఛాయలకు వెళ్లకుండా దూరంగా కూర్చుని జూదాన్ని ప్రోత్సహించారు. కోడి పందేలు, గుల్లాటలు నిర్వహించుకోవాలంటే పోలీసులకు మామూళ్లు ఇవ్వాంటూ కొంతమంది స్థానికులు ఆయా జూదాల నిర్వాహకుల నుంచి సుమారు రూ.60 వేలు వసూలు చేసినట్టు తెలిసింది. బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు సమీపంలోని ఒక చర్చి వద్ద సేదతీరుతూ ఉండిపోయారే తప్ప కోడి పందేలు, గుల్లాటల వైపు రాలేదు.

వైసీపీ నేతలు బరితెగింపు

ఎం.కొత్తపల్లిలో రామాలయం గోడకు సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకం

- మరోవైపు పంచాయతీ పాలకవర్గం పేర్లతో ఇంకోటి...!
- విస్తుపోతున్న స్థానికులు

చోడవరం, ఫిబ్రవరి 6: అధికారాన్ని అడ్డంపెట్టుకుని వైసీపీ నేతలు నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రచారం కోసం ప్రభుత్వ భవనాలనే కాదు చివరకు గుడి, బడిని కూడా వదలడంలేదు. మండలంలోని గంధవరం పంచాయతీ ఎం.కొత్తపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని రామాలయం గోడకు బిగించారు. ఇది ఒక మతానికి చెందిన వారి మనోభావాలను దెబ్బతీయడమేనని స్థానికులు అంటున్నారు. వేరే మతాల వారికి చెందిన ప్రార్థనా మందిరాల గోడలకు ఇదే విధంగా శిలాఫలకాలను ఏర్పాటు చేయగలరా? అన్ని ప్రశ్నిస్తున్నారు. ఇందుకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలిలా వున్నాయి.



ఎం.కొత్తపల్లిలో రాయాలయం గోడకు ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకం



రామాలయంకు రెండోవైపున గోడకు పంచాయతీ పాలకవర్గం పేర్లతో తగిలించిన శిలాఫలకం

చోడవరం మండలం గంధవరం పంచాయతీ శివారు ఎం.కొత్తపల్లిలో ఉపాధి హామీ పథకం కింద రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. దీంతో పాటు పంచాయతీలో ఇతర పథకాలను ఈ నెల 3న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి ప్రారంభించారు. అయితే సీసీ రోడ్డు పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఏకంగా రామాలయం గోడకు బిగించారు. పనిలోపనిగా అదే గుడికి రెండో వైపు గోడకు పంచాయతీ పాలకవర్గం సభ్యుల పేర్లతో మరో శిలాఫలకాన్ని బిగించారు. ఇప్పటి వరకు ప్రభుత్వ భవనాలు, తాగునీటి పథకాలు, శ్మశానవాటికలకు వైసీపీ జెండాలోని రంగులు వేయించి ప్రచారం చేసుకుంటున్న వైసీపీ నాయకులు.. మరో అడుగు ముందుకు వేసి ఏకంగా ఒక మతానికి చెందిన ప్రార్థనా మందిరం గోడకు శిలాఫలకాన్ని బిగించారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే.. సంక్షేమ పథకాలను రద్దు చేయిస్తామని హెచ్చరిస్తున్నారని వాపోయారు. సీసీ రోడ్డుకు ఇరువైపులా మరెక్కడైనా దిమ్మకట్టి శిలాఫలకాన్ని బిగించవచ్చని, కానీ ఆలయానికి వచ్చిన ప్రతి ఒక్కరూ ఈ శిలాఫలకాన్ని, అందులోని తమ పేర్లను చూడాలన్న ఉద్దేశంతోనే ... మిగతా 7వ పేజీలో

జోగంపేట హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

- విద్యార్థి మృతికి అతని నిర్లక్ష్యమే కారణమని అధికారులు నిర్ధారణ



వార్డెన్ అప్పారావు

గొలుగొండ, ఫిబ్రవరి 6: మండలంలోని జోగం పేట సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహం వార్డెన్ మద్దు అప్పా రావును సస్పెండ్ చేస్తూ ఏఎస్ డబ్ల్యూఓ ఎం.శ్యామల మంగళ వారం ఉత్తర్వులు జారీ చేశారు. వసతిగృహంలో విద్యాదాఘాతానికి గురై విద్యార్థి మృతిచెందడానికి ఇతని నిర్లక్ష్యమే కారణమని అధికా రుల విచారణలో తెలడంతో ఈ మేరకు చర్యలు తీసు కున్నారు. పాత మ్లంలపేట పంచాయతీ శివారు బుడ్డడపాడు గ్రామానికి చెందిన తుబిరె దావీద్‌రాజ్(12) జోగంపేట హైస్కూల్లో ఏడవ తరగతి చదు వుతూ, సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో వుంటున్నాడు. ఈ నెల 4వ తేదీన మేడపై దుస్తులు ఆరబెట్టడానికి వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై అధికారులు విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదించారు. అదే విధంగా ఈపీడీసీఎల్ అధికారులు కూడా తనిఖీలు చేసి, తమ శాఖపరంగా ఎటువంటి లోపాలు లేవని వెల్లడించారు. దీంతో విద్యార్థి మృతికి వార్డెన్ అప్పారావు నిర్లక్ష్యమే కారణమని నిర్ధారించిన ఉన్నతాధికారులు అతనిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సీపట్నం సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్ గోవిందకు జోగంపేట వసతిగృహం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

అంతర్గత వైరింగ్‌లో లోపాలే ప్రమాదానికి కారణం : ఈపీడీసీఎల్ ఈఈ



హాస్టల్‌లో విద్యుత్ వైరింగ్‌ను పరిశీలిస్తున్న ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ

జోగంపేటలోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలో విద్యుత్ అంతర్గత వైరింగ్ సరిగా లేదని, దీని వల్ల శ్లాబ్‌తోపాటు తడిగా వున్న గోడలు, ఇనుప ఊచలకు విద్యుత్ సరఫరా జరిగినట్టు గుర్తించామని ఈపీడీసీఎల్ ఈఈ వీడీవీ రామకృష్ణ చెప్పారు. ఆయన మంగళవారం వసతి గృహాన్ని పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, వసతిగృహంలో విద్యుత్ వైరింగ్ అస్తవ్యస్తంగా వుందన్నారు. భవనంపైన వాటర్ ట్యాంకు వద్ద గల ఇనుప పైపుకు విద్యుత్ సరఫరా జరిగి, దీనిని తాకడంతో విద్యార్థి మృతిచెందాడని చెప్పారు. ఈ సంఘటనకు తమ శాఖ కారణం కాదని స్పష్టం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌తోపాటు ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఈఈ చెప్పారు.



ఆర్డీఓ జయరామ్ కారును అడ్డగించి తన సమస్య చెప్పుకుంటున్న రైతు గోవిందరావు



తహసీల్దారు కార్యాలయం వద్ద విలపిస్తున్న గోవిందరావు

భూ సమస్యపై అర్ధనగ్నంగా రైతు నిరసన

- ఆర్డీఓ కారుకు అడ్డుపడి గోడు వెలిబుచ్చుకున్న వైనం

నాతవరం, ఫిబ్రవరి 6: తన భూమి సమస్యను పరిష్కరించాలంటూ ఓ రైతు మంగళవారం నాతవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద అర్ధనగ్నంగా నిరసన తెలియజేశాడు. తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలకు వచ్చిన నర్సీపట్నం ఆర్డీఓ జయరామ్ వాహనానికి అడ్డుగా నిల్చున్నాడు. సమస్య గురించి ఆర్డీఓ తెలుసుకుని పరిష్కరించాలని డీటీని ఆదేశించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

నాతవరం మండలం ఏపీపురం గ్రామానికి చెందిన పోలుపర్తి గోవిందరావుకు సర్వే నంబరు 211/3లో ఒక ఎకరం 15 సెంట్లు భూమి ఉంది. దీనికి సంబంధించి రెవెన్యూ అధికారులు గతంలో పట్టాదారు పాసుపుస్తకం కూడా ఇచ్చారు. అయితే 15 సెంట్లు భూమి మాత్రమే ఉన్నట్టు రెండేళ్ల క్రితం ఆన్‌లైన్‌లో చూపించడంతో ఆందోళన చెందాడు.

తనకు చెందిన ఎకర భూమి వేరే వారి పేరున ఆన్‌లైన్‌లో చూపిస్తున్నట్టు గుర్తించి ఈ సమస్యను పరిష్కరించాలని నాతవరం తహసీల్దార్ కార్యాలయం సిబ్బందిని, అధికారులను కలిసి కోరాడు. ఎన్ని నెలలైనా పట్టించుకోకపోవడంతో అనకాపల్లి వెళ్లి స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అయినాసరే సమస్య పరిష్కారం కాలేదు. దీనితో మంగళవారం నాతవరం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి కన్నీటిఇ పర్యంతం అవుతూ అర్ధనగ్నంగా నిరసన తెలియజేశాడు. అప్పటికే తహసీల్దార్ కార్యాలయంలో వున్న నర్సీపట్నం ఆర్డీఓ జయరామ్.. బయటకు వచ్చి కారులో ఎక్కి బయలుదేరారు. దీంతో రైతు గోవిందరావు కారుకు అడ్డం వెళ్లి, తన గోడు వెల్లబోసుకున్నాడు. ఆర్డీవో స్పందించి, ఈ సమస్యలను పరిష్కరించాలని పక్కనే ఉన్న డిప్యూటీ తహసీల్దార్ చైనులను ఆదేశించారు. దీంతో రైతు గోవిందరావు శాంతించాడు.

అంతర్ జిల్లా జూనియర్ మహిళా హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక


అంతర్ జిల్లా హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 6: శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 9వ తేదీ నుంచి జరుగనున్న 14వ అంతర్ జిల్లా జూనియర్ ఉమెన్ హాకీ టోర్నమెంటుకు అనకాపల్లి జిల్లా జట్టును మంగళవారం ఇక్కడ రాజీవ్ గాంధీ క్రీడామైదానంలో ఎంపిక చేసినట్టు జిల్లా హాకీ అడ్‌హక్ కమిటీ వైస్ ఛైర్మన్ కొరారు నరేశ్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. 16 మందిని ఎంపిక చేసిన అనకాపల్లి జిల్లా జట్టులో సీహెచ్.కుసుమ, కె.మహేశ్వరి, కె.లలిత, ఝాన్సీ, శైలజ, ఎం.పూర్ణిమ, రమ్య, తరుణశ్రీ, జె.గాయత్రి, కె.శ్రావ్య, పి.లాస్యప్రియ, బి.నిహారిక, ఎస్.జాహ్నవి, ఎం.భవాని, ఎస్.దుర్గ, డి.వర్షిణి వున్నారని, కోచ్‌గా శ్రీకర్ వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఏటీఎల్.రాజు, నేవీ రాంబాబు, పాల్గొన్నారు.

ఎంఈవో-2 సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నిక


ఎంఈవో-2 నూతన కార్యవర్గం

కొత్తూరు (అనకాపల్లి), ఫిబ్రవరి 6: మండల విద్యా శాఖాధికారుల (ఎంఈవో) సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం కొత్తూరులో జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో-2ల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు అధ్యక్షునిగా పి.ఎస్.ఎన్.మూర్తి (మాకవరపాలెం), ప్రధాన కార్యదర్శిగా బి.విశ్వేశ్వరరావు (బుచ్చెయ్యపేట), కోశాధికారిగా బి.శివనాయుడు (మునగపాక), గౌరవ అధ్యక్షుడిగా వి.ఎస్.ఎన్.మూర్తి (సబ్బవరం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంఈవో-2లు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ ప్రతినిధులు చెప్పారు.

మొక్కుబడిగా ఉపాధి హామీ ప్రజావేదిక

కోటవురట్ల, ఫిబ్రవరి 6: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం ప్రజావేదిక మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశానికి ఎంపీపీ అప్పలనాయుడు, వైస్‌ఎంపీపీలు సీతాబాబు, చెక్కా సుజాత, జడ్‌పీటీసీ సభ్యురాలు ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు డుమ్మా కొట్టారు. సమావేశం ప్రారంభంలోనే అన్నవరం గ్రామంలో జరిగిన ఉపాధి పనుల్లో పలు అక్రమాలు జరిగినట్టు డీఆర్‌పీ నివేదికలో వెల్లడించారు. కైలాసపట్నం జనగన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న 19మందికి బిల్లులు మంజూరు చేయలేదని సర్పంచ్ పెనాడ నూకరత్నం జిల్లా అధికారులు దృష్టికి తీసుకు వెళ్లారు. మండలంలో 2022-2023 సంవత్సరానికి 847 పనులకు రూ. 10.52 కోట్ల వేతనాలు రూపంలో ఖర్చుచేయగా.. మెటీరియల్‌రూపం రూ.3.22 కోట్ల ఖర్చు చేసినట్టు తెలిపారు. ఈ పనుల్లో రూ.3.4 లక్షలు అవకతవకలు జరిగినట్టు, వాటిని జిల్లా అధికారులు రికవరీ చేయాలని కోరినట్టు ఎస్‌ఆర్‌పీ రామారావు తెలిపారు.

అలాగే రూ.18వేలు జరిమానా విధించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ సందీప్, అడిషనల్ పీడీ రోజారమణి, డీవీసీ నిర్మలాదేవి, ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఎంపీవో గంగునాయుడు, తదితరులు పాల్గొన్నారు

సర్వర్ సమస్యతో మందకొడిగా ఇళ్ల రిజిస్ట్రేషన్లు


రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 6: మండలంలోని జగనన్న ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు సర్వర్ సమస్యతో మందకొడిగా జరుగుతున్నాయి. పాయకరావుపేట పట్టణంలో సచివాలయం-1లో మంగళవారం సర్వర్ పని చేయకపోవడంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన లబ్ధిదారులు సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. మండలంలోని 24 పంచాయతీల పరిధిలో 18 జగనన్న ఇళ్ల కాలనీల లేఅవుట్లు వేశారు. ఇందులో 2,952 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. పాయకరావుపేట పట్టణంలో 1,250 మందికి పీఎల్.పురం పంచాయతీ శివారులో ఇళ్ల పట్టాలు ఇచ్చిన విషయం తెలిసిందే. మండలంలో ఇప్పటి వరకు 1,300 ఇళ్ల పట్టాలు వీఆర్వోల లాగిన్‌లోకి రావడంతో వీరందరికీ సంపూర్ణ హక్కు కల్పించడం కోసం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అయితే సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జాప్యం జరుగుతోంది. ఈ విషయమై ఈవోపీఆర్డీ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. మండలంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు సర్వర్ పనిచేయకపోవడం సమస్యగా ఉందన్నారు. ఇప్పటివరకు మండలంలో 549 రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు.

'చందాలతో రుద్రభూమికి ప్రహరీ నిర్మాణం'

అచ్యుతాపురం, ఫిబ్రవరి 6: ఆవరాజాం సర్వే నంబరు 91లో గల రుద్రభూమికి గ్రామంలో చందాలు పోగు చేసి ప్రహరీని నిర్మిస్తున్నామని సర్పంచ్ వియ్యపు నానాజీ తెలిపారు. 'రుద్రభూమి నుంచి రియల్టర్ రోడ్డు' అన్న శీర్షికలో ఈనెల ఐదున 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపెద్దలంతా సమావేశమై చందాలు పోగుచేసి ప్రహరీని నిర్మిస్తున్నామని వివరించారు. అలాగే ప్రజావసరాల నిమిత్తం పాఠశాలకు, రుద్రభూమికి మధ్య 60 అడుగుల వెడల్పున దారి ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ

కశింకోట, ఫిబ్రవరి 6: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డ్వాక్రా మహిళలకు 4వ విడత ఆసరా చెక్కులను వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని డ్వాక్రా గ్రూపులకు రూ.13.27 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. మహిళలు అభివృద్ధి చెందాలని ఆర్థికంగా భరోసా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగ లక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచులు జయరజిని, కలగ గున్నయ్యనాయుడు, వైసీపీ మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, డాక్టర్ విష్ణుమూర్తి, ఏపీఎం శ్రీనివాసరావు, మండల సమైక్య అధ్యక్షురాలు వేపాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తేగాడలో ఘనంగా బండారమ్మ తీర్థం

కశింకోట, ఫిబ్రవరి 6 : మండలంలోని తేగాడలో బండారమ్మ తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లజాము నుంచి పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

హైవేలో స్తంభించిన ట్రాఫిక్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 6 : అనకాపల్లి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం పొద్దుపోయిన తరువాత ట్రాఫిక్ స్తంభించింది. ఈ కారణంగా విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే మార్గంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక వాహనం డైట్ కళాశాల తోటాడ జంక్షన్ మధ్యలో రెండు పాడి పశువులను ఢీకొనడంతో అపస్మారకస్థితి పడ్డాయి. దీంతో రైతులు సంఘటన స్థలానికి చేరుకుని పాడి పశువులకు నష్టపరిహారం ఇవ్వాలని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. నష్టపరిహారంపై ఇరువర్గాల మధ్య చర్చలు జరుపుతున్నాయి.

సతీష్‌ను సత్కరించిన జనసైనికులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 6: జనసేన ఉత్తరాంధ్ర వ్యవహారాల ముఖ్య ప్రతినిధిగా నియామకమైన సుందరపు సతీష్‌కుమార్‌ని జనసేన మండల శ్రేణులు మంగళవారం ఆయన స్వగృహంలో గజమాలతో సత్కరించాయి. ఈకార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బైలపూడి శ్రీరామదాసు, జడ్‌పీటీసీ మాజీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన రాష్ట్ర కార్యదర్శి మోటూరు శ్రీవేణి, తుమ్మల రాజు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల తీర్థం

రాంబిల్లి, ఫిబ్రవరి 6: మండలంలోని వీఆర్‌అగ్రహారంలో మంగళవారం సీతారాములవారి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్థానికులే కాకుండా సమీప గ్రామాల భక్తులు సీతారాములను దర్శించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు ఏర్పాటు చేశారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 6: మండలంలోని గోకులపాడులోని ఆంజనేయస్వామి ఆలయ 29వ వార్షికోత్సవాన్ని గ్రామస్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ విభీషణరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

లైనుకొత్తూరులో సురక్ష వైద్య శిబిరం

ఎలమంచిలి, ఫిబ్రవరి 6: మండలంలోని లైనుకొత్తూరులో రెండవ విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీడీఓ కొండబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్ పరిశీలించారు.

జడ్సీని సత్కరించిన దాడి వర్గీయులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 6 : అనకాపల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఒమ్మి అయ్యప్పనాయుడును మంగళవారం మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అనుచరులు కలిశారు. జోనల్ కమిషనర్‌ను మాజీ కౌన్సిలర్ కోటిపల్లి జేజీబాబు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.బాబి, యల్లపు శ్రీనివాస్, గిరిబాబు దుశ్శాలువాలతో సత్కరించారు.

నేడు రౌండ్ సమావేశం

మునగపాక, ఫిబ్రవరి 6: అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు గురించి బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక కోఆపరేటివ్ బ్యాంకులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, బ్రహ్మాజీ, ఆడారి మహేష్ తెలిపారు.

పవన్ మాటే మాకు శిరోధార్యం

» జనసేన రాష్ట్ర కార్యదర్శి శివదత్

నక్కపల్లి, ఫిబ్రవరి 6: జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాటే తమకు శిరోధార్యమని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు తాము కట్టుబడి వుంటామని జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ-జనసేన పొత్తుతో రాష్ట్రంలో వైసీపీ పాలనకు చరమగీతం పాడుతామని చెప్పారు. ఏ నియోజకవర్గం నుంచి ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టాలో ఆయనకు తెలుసునన్నారు. చంద్రబాబు కష్టకాలంలో వున్నప్పుడు ఎటువంటి షరతులు,డిమాండ్లు లేకుండా రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా పవన్ తీసుకున్న నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో మార్పుకు శ్రీకారం అన్నారు.

టిక్కెట్ ఎవరికిచ్చినా గెలుపే లక్ష్యం

అంతకుముందు జనసేన ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల నాయకులు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా పాయకరావుపేట నియోజకవర్గం టికెట్ టీడీపీ మహిళా అధ్యక్షురాలు అనితకు ఇచ్చినా ఆమె గెలుపు కోసం చాలా కష్టపడతామని జనసేన నాయకులు శానాపతి బాబూరావు, ఆకేటి గోవిందరావు, కురందాసు అప్పలరాజు, పాము గణేశ్, పిక్కిస్వామి చెప్పారు. ఒకవేళ పొత్తులో భాగంగా జనసేనకు కేటాయిస్తే రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్‌కు ఇవ్వాలని కోరారు. అంతేగాకుండా మధ్యలో పార్టీలోకి వచ్చిన వారికి ఇవ్వకూడదని చెప్పారు.

ఆటో డ్రైవర్ల ఆగ్రహం


నిరసన ర్యాలీ చేపడుతున్న ఆటో డ్రైవర్లు

నక్కపల్లి, ఫిబ్రవరి 6: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అంటూ వైసీసీ, టీడీపీ-జనసేన పార్టీలు ఇచ్చిన హామీల పట్ల ఆటో డ్రైవర్లు అభ్యంతరం చెబుతూ మంగళవారం ఉపమాక హైవే జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. వీరి ఆందోళనకు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ మహిళలకు బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే, తమ ఉపాధి దెబ్బతింటుందని ఆందోళన వెలిబుచ్చారు. ఆటోలకు ఫైనాన్స్ కూడా కట్టుకోలేమని, రాజకీయ పార్టీలు ఈ హామీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రతినిధులు రాజేశ్, రామకృష్ణ, నాగేశ్వరరావు, దేవుళ్లు, కృష్ణ, అర్జున, నూకరాజు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి : ఐదుగురుపై కేసు

కశింకోట, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని కొబ్బరితోటలో పేకాట ఆడుతున్న ఐదుగురుని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.750 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీరంతా కశింకోట ప్రాంతానికి చెందినవారుగా గుర్తించామని తెలిపారు.

పాయకరావుపేట ఈఆర్‌వోగా గీతాంజలి

నక్కపల్లి, ఫిబ్రవరి 6: పాయకరావుపేట నియోజకవర్గం ఎలక్టోరోల్ రిజిస్ట్రేషన్ అధికారిణిగా (ఈఆర్వో) గీతాంజలి నియమితులయ్యారు. ఇంతకుముందు వున్న ఈఆర్వో కేవీ రామలక్ష్మి స్థానంలో ఈమెను నియమించారు. ప్రస్తుతం సింహాచలం దేవస్థానం భూములకు సంబంధించి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఆమె పనిచేస్తున్నారు. మంగళవారం ఆమె నక్కపల్లిలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితాలు, ఓటర్ల నమోదు ప్రక్రియలపై చర్చించారు.

పీఏసీఎస్ ద్వారా రుణాల పంపిణీ

ఎలమంచిలి, ఫిబ్రవరి 6 : కొక్కిరాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలను అందించడం జరుగుతుందని పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ మళ్ల కొండబాబు అన్నారు. మంగళవారం బ్యాంకు ఆవరణలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంఘంలో వ్యవసాయ రుణం పొంది మరణించిన ఇద్దరు రైతుల కుటుంబాలకు జనతా ఇన్సూరెన్స్ చెక్కులను రూ.45 వేల చొప్పున బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు పందిరి రాంబాబు, యర్రంశెట్టి చిన్నబ్బాయి, సీఈవో పిల్లా మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

కారిడార్ పనులు అడ్డగింత

» డి.పట్టా, సాగుదారులకు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్


పనులను అడ్డుకున్న రైతులు, టీడీపీ, సీపీఎం నాయకులు

నక్కపల్లి, ఫిబ్రవరి 6: మండలంలోని చందనాడ రెవెన్యూ పరిధిలో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ) భూములున్న గుల్లబట్టీల వద్ద మంగళవారం అధికార యంత్రాంగం పనులు చేపడుతుండగా రైతులు, దళితులు, టీడీపీ, సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ కోసం జిరాయితీ, డి.పట్టా, ప్రభుత్వ, సాగుభూములను ఏపీఐఐసీ సేకరించిందని, కానీ డి.పట్టాదారులకు, సాగులో వున్న వారికి పూర్తి న్యాయం చేయకుండా పనులు ఎలా చేపడతారని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, సీపీఎం నేత ఎం.అప్పలరాజు ప్రశ్నించారు. భూములిచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించిన తరువాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, అధికారులే రైతుల వద్దకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం సర్పంచ్ పెదపూడి శంకరరావు, ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు, పెదకాపు, సత్తిబాబు, బాబూజజీ, సిరిపిల్లి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

crime news

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


పారుపల్లి కనకం (ఫైల్ ఫొటో)

రావికమతం, ఫిబ్రవరి 6: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి మందులు వాడుతున్నా వ్యాధి తగ్గకపోవడంతో మనస్తాపంతో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి రావికమతం ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని గుమ్మాళ్ళపాడు గ్రామానికి చెందిన పారుపల్లి కనకం(55) భార్య, ముగ్గురు కుమార్తెలతో నివాసముంటున్నాడు. రిక్షా నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కాగా అతను కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. మందులు వాడుతున్నా తగ్గకపోవడంతో మానసికంగా కుంగిపోయేవాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై అతను మంగళవారం ఉదయం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతనిని రావికమతం ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉందని నర్సీపట్నం తరలించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో 108 వాహనంలో నర్సీపట్నం తరలిస్తుండగా మార్గమధ్యంలో కొత్తకోట దాటాక అతను మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 6: మండలంలో గల లబ్బూరు సమీపంలో ఒక కారులో తరలిస్తున్న సుమారు 20 కిలోల గంజాయిని మంగళవారం స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు గంజాయి స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్ఐ కె.రవీంద్ర అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు పక్కా సమాచారం రావడంతో లబ్బూరు సమీపంలో వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఆ సమయంలో బరడ నుంచి లబ్బూరు వైపు ఓ కారు వస్తుంది. పోలీసులను చూసిన కారులో ఉన్న వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిలో నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఒక స్మగ్లర్ తప్పించుకున్నాడు. వారి నుంచి గంజాయితో పాటు రూ.60 వేల నగదు, ఒక కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ పనసపుట్టు గ్రామానికి చెందిన సిబా హంతల్, ఎలంపక గ్రామానికి చెందిన ఖిలా రమేశ్, కడగుమ్మా గ్రామానికి చెందిన ఖిలా మానస్, చిత్రకొండ బ్లాక్ పనసపుట్టు గ్రామానికి చెందిన భీష్మ హంతల్‌గా విచారణలో తేలింది. పరారైన వ్యక్తి ఒడిశాలోని కోరాపుట్టు గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పట్టుబడిన నిందితులను కోర్టుకు తరలించారు.

ఉద్యోగాల పేరుతో వసూళ్లపై విచారణ

చోడవరం, ఫిబ్రవరి 6: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చోడవరం, మాడుగుల ప్రాంతాలకు చెందిన పలువురు యువకుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన నగర పోలీస్ కానిస్టేబుల్ రమణమూర్తి, అతని సోదరుడు మోహన్‌బాబులపై గత నెల 29న స్పందనలో కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ యువకుల ఫిర్యాదుపై విచారణ చేయాలంటూ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు. కానిస్టేబుల్, అతని సోదరుడికి ఇచ్చిన డబ్బులకు సంబంధించిన ఆధారాలు ఇవ్వాలని బాధితులను కోరామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆధారాలు పరిశీలించిన మీదట ఈ వ్యవహారంలో తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడి అరెస్టు

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 6: మండలంలోని అమలాపురం గ్రామానికి చెందిన బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ యువకుడిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ భీమరాజు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అమలాపురం గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం మధ్యాహ్నం కళాశాల నుంచి ఇంటికి వెళ్లడానికి వేచి ఉండగా, అదే గ్రామానికి చెందిన చిందాడ రాజ్‌కుమార్ వచ్చి ఇంటికి తీసుకువెళతానని చెప్పి బైక్ ఎక్కించుకున్నాడు. కొంత దూరం వెళ్లిన తరువాత జీడితోటల్లోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాజ్‌కుమార్‌ని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బదిలీ అయిన పోలీసు అధికారులకు వీడ్కోలు సత్కారం


బదిలీ అయిన పోలీస్ అధికారులతో ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 6: జిల్లా నుంచి బదిలీ అయిన పలువురు పోలీసు అధికారులను సోమవారం రాత్రి పోలీస్ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ సత్కరించారు. నర్సీపట్నం ఏఎస్పీ అధిఇరాజ్‌సింగ్‌రాణా, డీటీసీ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, వెంకటరావు, కోటిబాబులకు వీడ్కోలు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ట్రైనీ డీఎస్పీ భవ్య పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో వలంటీర్లు వద్దు : నాగజగదీశ్

అనకాపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో గ్రామ/వార్డు వలంటీర్లను వైసీపీ తరుపున వినియోగించుకోవాలనుకోవడం సరికాదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బు నుంచి వలంటీర్లకు జీతాలు చెల్లిస్తున్నారని, అటువంటి వలంటీర్లు వచ్చే ఎన్నికల్లో వైసీపీ అండగా వుండాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పిలుపునివ్వడం సిగ్గు చేటన్నారు. వలంటీర్లను ఎన్నికల విధుల్లో ఎక్కడా ఉపయోగించవద్దని ఎన్నికల సంఘం స్పష్టం చేసినప్పటికీ, వైసీపీ పాలకులు స్థానిక అధికారులపై ఒత్తిడి తెచ్చి వలంటీర్లతోనే ఓటర్ల జాబితాల సవరణ చేయించారని ఆయన ఆరోపించారు. వలంటీర్లను ఎన్నికల విధులు విధులు అప్పగిస్తే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని నాగజగదీశ్ స్పష్టం చేశారు.

కార్శి చెరకుకు కొరడా తెగులు బెడద

అనకాపల్లి అగ్రికల్చర్, ఫిబ్రవరి 6: చెరకు కార్శి చేసుకునే రైతులు వీలైనంత త్వరగా పొలం అంతటినీ ఒకేసారి మోడు చెక్కి కార్శి చేయాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కార్శి తోటలకు ముఖ్యంగా విశ్వామిత్ర వంటి రకాలకు కొరడా తెగులు ఆశించవచ్చని చెప్పారు. దీనిని నివారించడానికి ప్రొపికోనజోల్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి, కార్శి మోడు చెక్కిన వెంటనే పిచికారీ చేయాలని సూచించారు. వేసవిలో నువ్వు సాగు చేయాలను వారంలోగా విత్తుకోవాలని చెప్పారు. మినుము, పెసర, కంది వంటి అపరాల పంటల్లో చిత్తపురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ మందును లీటరు నీటికి 2.5 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

దువ్వాడ మీదుగా చెన్నై, భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 6: ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా చెన్నై, భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 06073 నంబరు గల రైలు ఈనెల 29న రాత్రి 11.45 గంటలకు చెన్నైలో బయలుదేరి మర్నాడు ఉదయం 11.15 గంటలకు దువ్వాడ, సాయంత్రం 6.30 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 06074 నంబరు గల రైలు ఈనెల 30న రాత్రి 9.00 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు తెల్లవారుజాము 3.42 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 3.00 గంటలకు చెన్నై చేరుతుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	104.00
లైవ్ ధర	124.00
విత్ స్కిన్	218.00
స్కిన్ లెస్	228.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

హామీలు నెరవేర్చాలని పారిశుధ్య కార్మికుల ధర్నా

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 6 : సమ్మెలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ మంగళవారం జీవీఎంసీ జోనల్ కార్యాయం ఎదుట పారిశుధ్య కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సమస్యలు పరిష్కరించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగుల పర్మినెంట్, ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్సు, క్లాప్ డ్రైవర్లకు రూ. 18,500 జీతంతో కూడిన తదితర డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు, కార్మికులు వై.ఏసు, శివకుమార్, బొమ్మల రాము, నిమ్మకాయల అజయ్ తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

శ్రీను కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది : పీలా గోవింద

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 6 : మండలంలోని సుందరయ్యపేటకి చెందిన టీడీపీ కార్యకర్త బాదపు శ్రీను కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. కోటపాడు మండలం గొండుపాలెంలో సోమవారం జరిగిన రా.. కదలిరా.. సభలో దురదృష్టవశాత్తూ ఎండ దెబ్బతో శ్రీను మృతి చెందాడన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఎన్టీఆర్ వైద్యాలయంలో శ్రీను పార్థివదేహానికి పీలాతో పాటు పలువురు టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీను కుటుంబానికి దహన సంస్కారాలకు రూ.10వేలు అందజేశారు. అంతేకాకుండా తన సొంత నిధులు రూ.లక్ష ఇస్తానని తెలిపారు. శ్రీను కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు భరిణికాన బాబూరావు, బాదపు తాతారావు, నంబారు శ్రీను, పచ్చికూర రాము, నారపిన్ని చంద్రశేఖర్, వియ్యపు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


శ్రీను మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పీలా గోవింద

రైల్వే బోర్డు చైర్మన్‌ను కలిసిన ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 6: అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని రైల్వే అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా సహకరించాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి మంగళవారం రైల్వే బోర్డు చైర్మన్ జయవర్మసిన్హాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేశారు. లంకెలపాలెం లెవెల్ క్రాసింగ్ వద్ద అండర్‌బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు ఇచ్చి నిర్మాణాలు చేపడుతున్నందుకు ధన్యవాదాలు తెలిపామన్నారు. సత్యనారాయణపురం రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి రూ. 11 కోట్లతో అంచనాలను ఇప్పటికే రైల్వే ఉన్నతాధికారులు ప్రాజెక్టు రిపోర్ట్ సిద్ధం చేసి రైల్వే బోర్డు అనుమతి కోసం పంపించడం జరిగిందన్నారు. పనులు ప్రారంభమయ్యేలా అధికారులకు ఆదేశాలివ్వాలని కోరామన్నారు. బోర్డు చైర్మన్ సానుకూలంగా స్పందించారన్నారు. రైల్వే జోనల్ కార్యాలయ నిర్మాణాలు త్వరగా మొదలు పెట్టినట్టయితే ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం సౌత్‌కోస్ట్ రైల్వేజోన్ సహకారమవుతుందని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వస్తాయని వివరించామన్నారు.


రైల్వే బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం ఇచ్చిన ఎంపీ సత్యవతి

తూర్పుకాపులకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరుచేయాలి

» సంఘం జిల్లా అధ్యక్షుడు కరణం శ్రీహరి

కోటవురట్ల, ఫిబ్రవరి 6: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తూర్పుకాపు కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని తూర్పు కాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కరణం శ్రీహరి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంపెక్సు ఆవరణలో జరిగిన తూర్పు కాపుల సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర మండలాల్లో తూర్పుకాపు సర్టిఫికెట్లు ఇస్తున్నారన్నారు. గతంలో కోటవురట్ల మండలంలో కూడా తూర్పుకాపు సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు. వాటిని ప్రస్తుతం రెన్యువల్ చేయడం లేదని, దీనివల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు తక్షణమే స్పందించి తూర్పుకాపు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే దశలవారీగా పోరాటం చేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకటరమణకు వినతపత్రం అందజేశారు. తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు అన్నవరం సర్పంచ్ బాబ్జి, అన్న స్వరాజ్యారావు, గొట్టివాడ సుంకర బాబ్జి తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాపు నేతలు

జంపపాలెంలో డీవైఈవో నైట్ విజిట్

ఎలమంచిలి, ఫిబ్రవరి 6: మండలంలోని జంపపాలెం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రగతిని మంగళవారం రాత్రి జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి అప్పారావు పరిశీలించారు. హైస్కూల్‌కు చెందిన కొంతమంది పదో తరగతి విద్యార్థులు ఒకచోట రాత్రి వేళలో చదువుకుంటున్నారు. డిప్యూటీ విద్యాశాఖాధికారి అప్పారావు మంగళవారం రాత్రి అక్కడకు వెళ్లి పరీక్షలకు విద్యార్థులు ఎలా సన్నద్ధం అవుతున్నారో పరిశీలించారు. వర్క్ బుక్స్‌ను పరిశీలించిన అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట హెచ్ఎం శాస్త్రి, ఉపాధ్యాయులు ఉన్నారు.


టెన్త్ విద్యార్థి విద్యా ప్రగతిని పరిశీలిస్తున్న అప్పారావు

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

పరవాడ: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని డిప్యూటీ డీఈవో అప్పారావు సూచించారు. మంగళవారం ఆయన వాడచీపురుపల్లి జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.కార్యక్రమంలో హెచ్ఎం పి.కనకేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి

కొమ్మాది (విశాఖపట్నం), ఫిబ్రవరి 6: దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న ఇద్దరు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మృత్యువు పాలయ్యారు. నగర శివారు కొమ్మాది సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోతినమల్లయ్యపాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవాల్తేరు నీలాపువారి వీధికి చెందిన పి.నిరంజన్ (20), కె.మణికంఠరెడ్డి (21) స్నేహితులు. వీరు...మరో ఇద్దరు స్నేహితులు ద్విచక్ర వాహనాలపై మంగళవారం విజయనగరం పైడితల్లమ్మ దర్శనానికి వెళ్లారు. నిరంజన్, మణికంఠరెడ్డి ఒక బైక్‌పై ఉన్నారు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా బోరవానిపాలెం వద్ద రహదారిపై గేదె అడ్డొచ్చింది. దానిని తప్పించే క్రమంలో ఉండగా వెనుక నుంచి గ్యాస్ సిలిండర్ల లోడుతో వస్తున్న లారీ ఢీకొంది. దీంతో నిరంజన్, మణికంఠరెడ్డి లారీ కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. వీరిలో నిరంజన్ నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతుండగా మణికంఠరెడ్డి ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వీరి తల్లిదండ్రులు రోజువారీ కూలీలు. చదువుకుని ప్రయోజకులవుతారనుకుంటే ఇలా అర్థంతరంగా తమను వదిలి కడుపుకోత మిగిల్చారంటూ ఇరువురి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ తరలించారు. సీఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 6: స్థానిక ఏఎంఏఎఎం రోటరీ కంటి ఆస్పత్రిలో ఏడుగురు పేదలకు మంగళవారం ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. సోమవారం ఆస్పత్రికి 36 మంది కంటి రోగులు రాగా వారిని నేత్ర వైద్య సహాయకులు పి.దేవి పరీక్షలు నిర్వహించారని ఆస్పత్రి చైర్మన్ రవిరాం జవహర్ తెలిపారు. వీరిలో ఏడుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించడంతో మంగళవారం డాక్టర్ కె. మల్లేశ్వరరావు వారికి ఐఓఎల్ ఆపరేషన్లు నిర్వహించారన్నారు. రోగులకు ఐదు రోజులకు సరిపడా మందులను ఉచితంగా అందజేశామని వివరించారు.

వైసీపీ నేతలు బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

వైసీపీ నాయకులు దీనిని ఏర్పాటు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని రామాలయం గోడకు ఎలా బిగించారని పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ ఇంజినీరింగ్ అధికారులను అడిగితే ఎవరికి వారు తమకు సంబంధం లేదని తప్పించుకుంటున్నారని, దీనికి కారకులైన వారిపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని తెలుగుయువత జిల్లా నాయకుడు దేవరపల్లి రవికుమార్ డిమాండ్ చేశారు. వైసీపీ నాయకుల చర్య హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వుందని ఆయన ఆరోపించారు.

కాగా ఎం.కొత్తపల్లిలో రామాలయం గోడకు సీసీ రోడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని బిగించడంపై పంచాయతీరాజ్ డీఈఈ జీఎస్ఎస్ ప్రసాద్‌ను వివరణ కోరగా, ఈ విషయం తన దృష్టికి రాలేదని, సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని రామాలయం గోడకు బిగించాలని తాము ఎవరికీ అనుమతి ఇవ్వలేదు.

రాద్ధాంతం చేస్తున్నారు

పల్లా నరసింగరావు, డీసీఎంఎస్ చైర్మన్, గంధవరం

ఎం.కొత్తపల్లిలో రామాలయం గోడకు సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకం అతికించలేదు. ఆలయం గోడకు దగ్గరగా వేరే దిమ్మ కట్టి, దానికి బిగించాం. ఆలయంలో అభివృద్ధి పనులను పంచాయతీ పాలకవర్గం చేపట్టనందున రామాలయం గోడకు పంచాయతీ పాలకవర్గం పేర్లతో శిలాఫలకం పెట్టాం. దీనిని అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారు.

నేడు చింతకాయల ముత్యాలు జన్మదిన వేడుకలు

పరవాడ, ఫిబ్రవరి 6 : పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు జన్మదిన వేడుకలను స్వగ్రామం ముత్యాలమ్మపాలెంలో బుధవారం నిర్వహించనున్నట్టు చింతకాయల యువసేన ప్రతినిధులు తెలిపారు. జన్మదిన వేడుకల్లో వృద్ధులకు దుప్పట్లు, వితంతువులకు చీరలు పంపిణీ, దివ్యాంగులకు బియ్యం పంపిణీ, ఇంటర్, పదో తరగతిలో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామంలో అన్నసమారాధన నిర్వహించనున్నట్టు వారు వెల్లడించారు.

గురుకుల పాఠశాల/ కళాశాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

సబ్బవరం, ఫిబ్రవరి 6 : స్థానిక గురుకులు పాఠశాల/ కళాశాల్లో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సీహెచ్‌వీవీ సత్యారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్ ఎంఈసీలో 40 సీట్లు, సీఈసీలో 40 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగిన వారు దగ్గర్లోని ఇంటర్నెట్ సెంటర్‌కి వెళ్లి గురుకులం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సత్యారావు సూచించారు.

ఘనంగా నాగూరమ్మ పండగ

అచ్యుతాపురం, ఫిబ్రవరి 6: పూడిమడక శివారు కడపాలెంలో మంగళవారం నాగూరమ్మ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాలారిపాలెం, పెద్దూరు, పల్లిపేట, ఎస్సీకాలనీ, కొండపాలెం, కడపాలెంల నుంచి భక్తులు వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు.

9న రక్తదాన శిబిరం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 6 : రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల తొమ్మిదవ తేదీన పీటీడీ జిల్లా ఆఫీస్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారిణి కె. పద్మావతి తెలిపారు. పీటీడీ కాంప్లెక్స్ ఆవరణలోని మేడపై జరిగే ఈ రక్తదాన శిబిరానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి : సీపీఎం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 6 : రాష్ట్రంలోని ఖాళీగా ఉన్న 25వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తూ మెగా డీఎస్సీని ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేస్తారని ఎదురుచూసిన నిరుద్యోగులకు నిరాశే ఎదురైందన్నారు. వెంటనే మెగా డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా కేవలం 6,100 పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించడం నిరుద్యోగులను మోసం చేయడమే అవుతుందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అనుబంధ రంగాల పోస్టులన్నీ భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు.

క్రైం... crime news

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



పారుపల్లి కనకం (ఫైల్ ఫొటో)

రావికమతం, ఫిబ్రవరి 6: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి మందులు వాడుతున్నా వ్యాధి తగ్గకపోవడంతో మనస్తాపంతో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి రావికమతం ఎస్‌ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని గుమ్మాళ్ళపాడు గ్రామానికి చెందిన పారుపల్లి కనకం(55) భార్య, ముగ్గురు కుమార్తెలతో నివాసముంటున్నాడు. రిక్షా నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కాగా అతను కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. మందులు వాడుతున్నా తగ్గకపోవడంతో మానసికంగా కుంగిపోయేవాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై అతను మంగళవారం ఉదయం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతనిని రావికమతం ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉందని నర్సీపట్నం తరలించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో 108 వాహనంలో నర్సీపట్నం తరలిస్తుండగా మార్గమధ్యంలో కొత్తకోట దాటాక అతను మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 6: మండలంలో గల లబ్బూరు సమీపంలో ఒక కారులో తరలిస్తున్న సుమారు 20 కిలోల గంజాయిని మంగళవారం స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు గంజాయి స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ కె.రవీంద్ర అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు పక్కా సమాచారం రావడంతో లబ్బూరు సమీపంలో వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఆ సమయంలో బరడ నుంచి లబ్బూరు వైపు ఓ కారు వస్తుంది. పోలీసులను చూసిన కారులో ఉన్న వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిలో నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఒక స్మగ్లర్ తప్పించుకున్నాడు. వారి నుంచి గంజాయితో పాటు రూ.60 వేల నగదు, ఒక కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ పనసపుట్టు గ్రామానికి చెందిన సిబా హంతల్, ఎలంపక గ్రామానికి చెందిన ఖిలా రమేశ్, కడగుమ్మా గ్రామానికి చెందిన ఖిలా మానస్, చిత్రకొండ బ్లాక్ పనసపుట్టు గ్రామానికి చెందిన భీష్మ హంతల్‌గా విచారణలో తేలింది. పరారైన వ్యక్తి ఒడిశాలోని కోరాపుట్టు గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పట్టుబడిన నిందితులను కోర్టుకు తరలించారు.

ఉద్యోగాల పేరుతో వసూళ్లపై విచారణ

చోడవరం, ఫిబ్రవరి 6: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చోడవరం, మాడుగుల ప్రాంతాలకు చెందిన పలువురు యువకుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన నగర పోలీస్ కానిస్టేబుల్ రమణమూర్తి, అతని సోదరుడు మోహన్‌బాబులపై గత నెల 29న స్పందనలో కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ యువకుల ఫిర్యాదుపై విచారణ చేయాలంటూ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు. కానిస్టేబుల్, అతని సోదరుడికి ఇచ్చిన డబ్బులకు సంబంధించిన ఆధారాలు ఇవ్వాలని బాధితులను కోరామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆధారాలు పరిశీలించిన మీదట ఈ వ్యవహారంలో తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడి అరెస్టు

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 6: మండలంలోని అమలాపురం గ్రామానికి చెందిన బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ యువకుడిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ భీమరాజు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అమలాపురం గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం మధ్యాహ్నం కళాశాల నుంచి ఇంటికి వెళ్లడానికి వేచి ఉండగా, అదే గ్రామానికి చెందిన చిందాడ రాజ్‌కుమార్ వచ్చి ఇంటికి తీసుకువెళతానని చెప్పి బైక్ ఎక్కించుకున్నాడు. కొంత దూరం వెళ్లిన తరువాత జీడితోటల్లోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాజ్‌కుమార్‌ని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి



నిరంజన్, మణికంఠరెడ్డి (ఫైల్ ఫొటోలు)

విశాఖపట్నం, ఫిబ్రవరి 6: దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న ఇద్దరు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మృత్యువు పాలయ్యారు. నగర శివారు కొమ్మాది సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోతినమల్లయ్యపాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవాల్తేరు నీలాపువారి వీధికి చెందిన పి.నిరంజన్ (20), కె.మణికంఠరెడ్డి (21) స్నేహితులు. వీరు...మరో ఇద్దరు స్నేహితులు ద్విచక్ర వాహనాలపై మంగళవారం విజయనగరం పైడితల్లమ్మ దర్శనానికి వెళ్లారు. నిరంజన్, మణికంఠరెడ్డి ఒక బైక్‌పై ఉన్నారు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా బోరవానిపాలెం వద్ద రహదారిపై గేదె అడ్డొచ్చింది. దానిని తప్పించే క్రమంలో ఉండగా వెనుక నుంచి గ్యాస్ సిలిండర్ల లోడుతో వస్తున్న లారీ ఢీకొంది. దీంతో నిరంజన్, మణికంఠరెడ్డి లారీ కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. వీరిలో నిరంజన్ నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతుండగా మణికంఠరెడ్డి ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వీరి తల్లితండ్రులు రోజువారీ కూలీలు. చదువుకుని ప్రయోజకులవుతారనుకుంటే ఇలా అర్ధంతరంగా తమను వదిలి కడుపుకోత మిగిల్చారంటూ ఇరువురి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమి త్తం కేజీహెచ్ తరలించారు. సీఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ హత్య కేసులో నిందితుడికి రెండు వారాలు రిమాండ్

» కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పిటిషన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసులో నిందితుడు మురహరి సుబ్రహ్మణ్యం గంగారావుకు కోర్టు రెండు వారాలు రిమాండ్ విధించింది. విశాఖ రూరల్ తహసీల్దార్‌గా పనిచేసి విజయనగరం జిల్లా బొండపల్లి బదిలీ అయిన రమణయ్యను ఈ నెల రెండో తేదీ రాత్రి పది గంటల సమయంలో సుబ్రహ్మణ్యం గంగారావు ఇనుప రాడ్‌తో కొట్టి హత్యచేసిన విషయం తెలిసిందే. హత్య చేసిన తర్వాత చెన్నై పారిపోయిన నిందితుడిని నగర పోలీసులు సోమవారం అక్కడ అరెస్టు చేసి ఇక్కడకు తీసుకొచ్చారు. సుమారు 20 గంటలపాటు గంగారావును విచారించిన పోలీసులు...మంగళవారం కోర్టులో హాజరుపరిచగా రెండు వారాలు రిమాండ్ విధించింది.

పెదరుషికొండ ప్రాంతంలో ఒక అపార్టుమెంట్ నిర్మించిన స్థలానికి సంబంధించి కన్వేయెన్స్ డీడ్‌ను రమణయ్య జారీ చేయలేదనే హత్యకు తెగబడినట్టు నిందితుడు పోలీసుల విచారణలో వెల్లడించినట్టు తెలిసింది. తన పని చేయకుండా జాప్యం చేశారనే కోపంతో రాడ్‌తో కొట్టాలనుకున్నానని, ప్రాణాలు తీయాలని మాత్రం అనుకోలేదని నిందితుడు చెప్పినట్టు సమాచారం. తహసీల్దార్‌పై దాడి చేసిన తర్వాత ఆయన ప్రాణాలతో ఉన్నాడనే భావనతో తాను నేరుగా ఇంటికి వెళ్లిపోయానని పోలీసులకు వివరించినట్టు తెలిసింది. తహసీల్దార్ ప్రాణాలు కోల్పోయినట్టు తెలియడంతో నగరం నుంచి పరారైనట్టు తెలిపాడు. కాగా ఇంటి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లడానికి ఎవరు సహకరించారు?, కన్వేయన్స్ డీడ్ పని ఎవరు అప్పగించారు?, ఆర్థిక పరమైన లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని నిందితుడు రకరకాలుగా పోలీసులకు చెప్పినట్టు సమాచారం. దీంతో ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉన్నందున నిందితుడిని నాలుగు రోజులపాటు కస్టడీకి అప్పగించాలంటూ పీఎం పాలెం పోలీసులు కోర్టులో పిటిషన్ వేసినట్టు తెలిసింది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	104.00
లైవ్ ధర	124.00
విత్ స్కిన్	218.00
స్కిన్ లెస్	228.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

దారంతా మురుగుమయం

» సబ్బవరం ప్రధాన రహదారులపై ప్రవహిస్తున్న మురుగునీరు
» రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలతో అవస్థలు
» టీడీపీ హయాంలో ప్రారంభించిన భూగర్భ డ్రైనేజీ పనులు నిలిచిపోవడంతో ఇక్కట్లు



సబ్బవరంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

సబ్బవరం, ఫిబ్రవరి 6: సబ్బవరంలోని ప్రధాన రహదారులు మురికి కూపాలుగా మారాయి. గతంలో ఇక్కడ నిర్మించిన డ్రైనేజీలు ఆక్రమణకు గురికావడంతో ఇళ్లల్లోని వాడుక నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు వైసీపీ అధికారంలోకి వచ్చాక నిలిచిపోవ డంతో ఈ ప్రాంతవాసులకు అవస్థలు తప్పడం లేదు.

సబ్బవరం ఎన్టీఆర్ సర్కిల్ నుంచి చోడవరం వెళ్లే రోడ్డు, పెందుర్తి వైపు వచ్చే రోడ్డు, అటు అనకాపల్లి వెళ్లే రోడ్డు, జోడుగుళ్ల నుంచి పీలానగర్ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆర్ అండ్ బీ స్థలాలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. గతంలో నిర్మించిన డ్రైనేజీలను సైతం పూడ్చేసి కొందరు నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఇళ్లల్లోని వాడుక నీరు పోయే దారి లేక రోడ్లపై ప్రవహిస్తోంది. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది.

నిలిచిన భూగర్భ డ్రైనేజీ పనులు

టీడీపీ ప్రభుత్వ హయాంలో సబ్బవరంతో పాటు ఎనిమిది గ్రామాలను కలుపుతూ 29 కిలో మీటర్ల మేర భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి రూ.24.46 కోట్లు మంజూరయ్యాయి. 2018 డిసెంబరు 27న అప్పటి పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సాయినగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. 2019 జనవరిలో కాంట్రాక్టరు పనులు ప్రారంభించారు. అయితే ఆ తరువాత ఎన్నికలు జరగడం, వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి.



బేడ బుడగ జంగాల కాలనీ వద్ద ఇలా..

ఆక్రమణల తొలగింపు బాధ్యత రెవెన్యూశాఖదే

రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు, డ్రైనేజీలపై నిర్మాణాలను తొలగించాల్సిన బాధ్యత రెవెన్యూశాఖదేనని ఆర్ అండ్ బీ ఏఈ కృష్ణారావు తెలిపారు. ఇప్పటికే ఆక్రమణలపై సర్వే చేసి హద్దులు నిర్ణయించామని, దీనిపై తహసీల్దార్‌కు రెండు సార్లు లేఖలు రాశామన్నారు. ఆక్రమణలను తొలగించాల్సిన బాధ్యత రెవెన్యూశాఖ దేనని, అవసరమైతే తాము ఎక్స్‌కవేటర్లను సమకూరుస్తామని ఆయన చెప్పారు.

కారిడార్ పనులు అడ్డగింత

» డి.పట్టా, సాగుదారులకు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్



పనులను అడ్డుకున్న రైతులు, టీడీపీ, సీపీఎం నాయకులు

నక్కపల్లి, ఫిబ్రవరి 6: మండలంలోని చందనాడ రెవెన్యూ పరిధిలో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ) భూములున్న గుల్లబట్టీల వద్ద మంగళవారం అధికార యంత్రాంగం పనులు చేపడుతుండగా రైతులు, దళితులు, టీడీపీ, సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ కోసం జిరాయితీ, డి.పట్టా, ప్రభుత్వ, సాగుభూములను ఏపీఐఐసీ సేకరించిందని, కానీ డి.పట్టాదారులకు, సాగులో వున్న వారికి పూర్తి న్యాయం చేయకుండా పనులు ఎలా చేపడతారని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, సీపీఎం నేత ఎం.అప్పలరాజు ప్రశ్నించారు. భూములిచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించిన తరువాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, అధికారులే రైతుల వద్దకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం సర్పంచ్ పెదపూడి శంకరరావు, ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు, పెదకాపు, సత్తిబాబు, బాబూజజీ, సిరిపిల్లి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కల పెంపకం

» సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి



గొలుగొండ టేకు కలప డిపోలో టేకు వేలంలో పాల్గొన్న సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి

గొలుగొండ, ఫిబ్రవరి 6: కార్పొరేట్ సంస్థల సహకారంతో పార్కుల్లో, అటవీ భూముల్లో మొక్కల పెంపకాన్ని చేపడుతున్నట్టు సీసీఎఫ్ ఎస్.శ్రీకంఠనాథరెడ్డి తెలిపారు. మండలంలో మంగళవారం టేకు కలప డిపోలో నిర్వహించిన వేలం పాటకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ ఏడాది టేకు కలప ద్వారా రూ.8 కోట్ల 37 లక్షల ఆదాయాన్ని ప్రభుత్వానికి సమకూర్చినట్టు తెలిపారు. టేకు కలప సీపీజు ద్వారా రూ.2 కోట్ల 14 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. 257 హెక్టార్లలో కార్పొరేట్ సంస్థల ఆర్థిక సహకారంతో వివిధ రకాలైన మారుజాతి ప్లాంటేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సోషల్ ఫారెస్ట్ ద్వారా ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు ఐదుకోట్ల మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. విశాఖలోని ఇందిరా గాంధీ జూపార్కులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎన్‌టీపీసీ చేపడుతుందన్నారు. అరకులో ఈకో పార్కు అభివృద్ధి చేశామన్నారు. తాబేళ్ల అభివృద్ధికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో గల టేకు కలప డిపోల్లో 800 క్యూబిక్‌ల మీటర్లు, విజయనగరంలో వంద, అనంతగిరిలో 140 క్యూబిక్ మీటర్ల టేకు కలప వేలానికి సిద్ధంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్, సబ్ డీఎఫ్ సునీల్‌కుమార్, రేంజర్ శ్రీనివాస్, అటవీ అధికారి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యువత గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

» సాధించే వరకు అంకితభావంతో కృషి చేయాలి
» ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్
» ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో స్ఫూర్తిదాయక ప్రసంగం





ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యారులు (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న నిక్ వుజిసిక్

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): 'కల ఎప్పుడూ గొప్పగా ఉండాలి. దానిని సాకారం చేసుకునేందుకు నిరంతరం పరితపించాలి. లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఎదురయ్యే ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలవాలి. అప్పుడే విజయం దక్కుతుంది' అని ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో మంగళవారం సాయంత్రం విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తన జీవితంలో ఎదురైన అనేక సంఘటనలను ఉదహరిస్తూ జీవితంలో ఎలా ఉన్నత స్థానానికి చేరుకోవచ్చో వెల్లడిం చారు. గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుంటే అందుకు అనుగుణంగానే శ్రమించాలన్నారు. వాటిని సాధించే క్రమంలో ఎదురయ్యే అవాంతరాలను మనోధైర్యంతో ఎదుర్కోవాలన్నారు.

గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలి

జీవితంలో ఎత్తుపల్లాలు సహజమని, విజయం, ఓటమిని ఒకేలా తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు ప్రపంచంలోని 81 దేశాల్లో ప్రసంగాలు ఇచ్చానని, భారత్ అంటే ఇష్టమన్నారు. ఒక్క భారతదేశంలోనే తన జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చారన్నారు. దీనికి కృతజ్ఞతలను తెలిపారు. ఇప్పటివరకు భారత్‌కు ఎనిమిది సార్లు వచ్చానన్నారు.

జీవితాన్ని మార్చేది చదువే...

చదువుతోనే ఉన్నత జీవనం సాధ్యమన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే హార్డ్‌వర్క్‌తోపాటు విలువలు కూడా ముఖ్యమన్నారు. వ్యాపారం చేయడానికి, ఉద్యోగంలో చేరడానికి ముందు.. ప్రపంచాన్ని, దేశాన్ని మార్చే ఒక శక్తివన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని సూచించారు. ఏదైనా సాధించగలమన్న నమ్మకంతోపాటు ఐకమత్యం, కృతజ్ఞత ఉన్నప్పుడే గొప్పస్థాయికి చేరుకోగలరని నిక్ స్పష్టం చేశారు.

ఏషియా బుక్స్‌లో స్థానం..

హ్యూమన్ బీయింగ్ టూ బీయింగ్ హ్యూమన్ అంటూ వందలాది మంది విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. దీనికి ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించినట్టు ఆ సంస్థ ప్రతినిధి దిలీప్ పాత్రో ప్రకటించారు. కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మోడల్ స్కూల్ వద్ద ఉద్రిక్తత

» బాలికను ఓ యువకుడు తరచూ స్కూల్ నుంచి బయటకు తీసుకువెళ్లడంపై నిరసన
» పాఠశాల గేటుకు తాళం వేసి బాలిక బంధువుల ఆందోళన

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 6: స్థానిక మోడల్ స్కూల్ వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. పాఠశాలకు వచ్చిన బాలిక తరచూ ఓ యువకుడితో బయటకు వెళ్లి స్కూల్ విడిచిపెట్టిన తరువాత తోటి విద్యార్థినులతో కలిసి ఇంటికి వెళుతోంది. ఈ విషయం తెలిసి ఆ బాలిక తల్లిదండ్రులు, బంధువులు మంగళవారం ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. పాఠశాల గేటుకు తాళం వేసి హడావిడి చేశారు. విషయం తెలిసి ఎస్‌ఐ భీమరాజు సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపూడి గ్రామానికి చెందిన బాలిక మోడల్ స్కూల్‌లో చదువుతోంది. అదే గ్రామానికి చెందిన యువకుడు తల్లి మోడల్ స్కూల్ హాస్టల్‌లో వర్కర్‌గా పనిచేస్తోంది. తల్లి దగ్గరకు వస్తున్న క్రమంలో అతనికి ఆ బాలికతో పరిచయం ఏర్పడింది. బాలిక స్కూల్‌కు వచ్చి పుస్తకాల బ్యాగ్‌ను విడిచి పెట్టి అతనితో కారులో వెళ్లి స్కూల్ విడిచిపెట్టే సమయానికి వచ్చి పుస్తకాలు తీసుకుని అందరి విద్యార్థినులతో కలిసి ఇంటికి వెళుతుండేది. యువకుడు సెల్‌ఫోన్‌తో ఆ బాలిక ట్యాబ్‌కు చాటింగ్ చేసి బయటకు తీసుకువెళ్లేవాడు. ఈ విషయాన్ని బాలిక బంధువులు గమనించారు. దీంతో మంగళవారం ఆ పాఠశాల వద్దకు వెళ్లి ప్రిన్సిపాల్ సంధ్యారాణితో వాగ్వాదానికి దిగారు. ఎస్‌ఐ భీమరాజు అక్కడికి వచ్చి వారికి నచ్చజెప్పారు. దీనిపై ఆయన విచారణ జరుపుతున్నారు.

ఎన్నికల విధుల్లో వలంటీర్లు వద్దు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగజగదీశ్



బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో గ్రామ/ వార్డు వలంటీర్లను వైసీపీ తరుపున వినియోగించుకోవాలనుకోవడం సరికాదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బు నుంచి వలంటీర్లకు జీతాలు చెల్లిస్తున్నారని, అటువంటి వలంటీర్లు వచ్చే ఎన్నికల్లో వైసీపీ అండగా వుండాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పిలుపునివ్వడం సిగ్గు చేటన్నారు. వలంటీర్లను ఎన్నికల విధుల్లో ఎక్కడా ఉపయోగించవద్దని ఎన్నికల సంఘం స్పష్టం చేసినప్పటికీ, వైసీపీ పాలకులు స్థానిక అధికారులపై ఒత్తిడి తెచ్చి వలంటీర్లతోనే ఓటర్ల జాబితాల సవరణ చేయించారని ఆయన ఆరోపించారు. వలంటీర్లను ఎన్నికల విధులు విధులు అప్పగిస్తే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని నాగజగదీశ్ స్పష్టం చేశారు.

కార్శి చెరకుకు కొరడా తెగులు బెడద

» ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి అగ్రికల్చర్, ఫిబ్రవరి 6: చెరకు కార్శి చేసుకునే రైతులు వీలైనంత త్వరగా పొలం అంతటినీ ఒకేసారి మోడు చెక్కి కార్శి చేయాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కార్శి తోటలకు ముఖ్యంగా విశ్వామిత్ర వంటి రకాలకు కొరడా తెగులు ఆశించవచ్చని చెప్పారు. దీనిని నివారించడానికి ప్రొపికోనజోల్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి, కార్శి మోడు చెక్కిన వెంటనే పిచికారీ చేయాలని సూచించారు. వేసవిలో నువ్వు సాగు చేయాలనువారంలోగా విత్తుకోవాలని చెప్పారు. మినుము, పెసర, కంది వంటి అపరాల పంటల్లో చిత్తపురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ మందును లీటరు నీటికి 2.5 మిల్లీ లీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

ఎంఈవో-2 సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నిక



ఎంఈవో-2 నూతన కార్యవర్గం

కొత్తూరు (అనకాపల్లి), ఫిబ్రవరి 6: మండల విద్యా శాఖాధికారుల (ఎంఈవో) సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం కొత్తూరులో జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో-2ల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు అధ్యక్షునిగా పి.ఎస్.ఎన్.మూర్తి (మాకవరపాలెం), ప్రధాన కార్యదర్శిగా బి.విశ్వేశ్వరరావు (బుచ్చెయ్యపేట), కోశాధికారిగా బి.శివనాయుడు (మునగపాక), గౌరవ అధ్యక్షుడిగా వి.ఎస్.ఎన్.మూర్తి (సబ్బవరం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంఈవో-2లు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ ప్రతినిధులు చెప్పారు.

ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పోటీలు

రావికమతం, ఫిబ్రవరి 6: మేజరు పంచాయతీ కొత్తకోటలో శ్రీవల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ తీర్థ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బళ్ల పోటీలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ,చతుర్థ స్థానాల్లో చుక్కపల్లి, ఎం.కోటపాడు, కూండ్రం, సింహాద్రిపురం గ్రామాలకు చెందిన ఎడ్ల బళ్లు నిలిచాయి.

అంతర్ జిల్లా జూనియర్ ఉమెన్ హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



అంతర్ జిల్లా హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 6: శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 9వ తేదీ నుంచి జరగనున్న 14వ అంతర్ జిల్లా జూనియర్ ఉమెన్ హాకీ టోర్నమెంటుకు అనకాపల్లి జిల్లా జట్టును మంగళవారం ఇక్కడ రాజీవ్ గాంధీ క్రీడామైదానంలో ఎంపిక చేసినట్టు జిల్లా హాకీ అడ్‌హక్ కమిటీ వైస్ చైర్మన్ కొరారు నరేశ్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. 16 మందిని ఎంపిక చేసిన అనకాపల్లి జిల్లా జట్టులో సీహెచ్.కుసుమ, కె.మహేశ్వరి, కె.లలిత, ఝాన్సీ, శైలజ, ఎం.పూర్ణిమ, రమ్య, తరుణశ్రీ, జె.గాయత్రి, కె.శ్రావ్య, పి.లాస్యప్రియ, బి.నిహారిక, ఎస్.జాహ్నవి, ఎం.భవాని, ఎన్.దుర్గ, డి.వర్షిణి వున్నారని, కోచ్‌గా శ్రీకర్ వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఏబీఎల్.రాజు, నేవీ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన పోలీసు అధికారులకు సత్కారం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 6: జిల్లా నుంచి బదిలీ అయిన పలువురు పోలీసు అధికారులను సోమవారం రాత్రి పోలీస్ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ సత్కరించారు. నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, డీటీసీ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, వెంకటరావు, కోటిబాబులకు వీడ్కోలు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఉత్తమ సేవలు అందించి శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ట్రైనీ డీఎస్పీ భవ్య, పలువురు సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గం

వలంటీర్ హత్యపై కొనసాగుతున్న విచారణ

మాకవరపాలెం, ఫిబ్రవరి 6: మండలంలో ఈనెల ఒకటో తేదీన లచ్చన్నపాలెంలో హత్యకు గురైన వలంటీర్ హరినాథ్ కేసు ఆరు రోజులుగా విచారణ కొనసాగుతున్నది. అయితే వలంటీర్‌కి వివాహేతర సంబంధాలు అధికంగా ఉండడంతో పోలీసులు హత్య కేసును ఆ కోణంలో విచారణ వేగవంతం చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు 40 మందిని విచారించారు. అయితే వలంటీర్‌గా ఉండి ఒక ప్రైవేటు కంపెనీలో కూడా కొన్నాళ్లు ఉద్యోగం చేశాడు. ఈ కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. మంగళవారం లచ్చన్నపాలెం సచివాలయం సిబ్బందితోపాటు మరికొంతమంది యువకులను స్టేషన్‌కు పిలిచి విచారించారు. ఫోన్ కాల్స్ వివాహేతర సంబంధాలు అధికంగా ఉండడంతో పోలీసులకు ఈ కేసు ఒక సవాల్‌గా మారింది. కేసు విచారణ మరో మూడు రోజులు కొనసాగే పరిస్థితి ఉందని చెబుతున్నారు.

విద్యుత్ తీగలు తగిలి వరి గడ్డి దగ్ధం

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 6: మండలంలోని పాతలక్ష్మీపురం సమీపంలో విద్యుత్ వైర్లు తగిలి వ్యాన్‌లో తరలిస్తున్న వరి గడ్డి అగ్నికి ఆహుతయ్యింది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని చెట్టుపల్లి గ్రామానికి చెందిన సుంకర బాబూరావు వరి గడ్డిని వ్యాన్‌లో తీసుకువెళుతుండగా పాత లక్ష్మీపురం సమీపంలో విద్యుత్ వైర్లు తగిలి పెద్ద మంటలు చెలరేగాయి. ఇది గమనించిన వ్యాన్ డ్రైవర్, స్థానికులు గడ్డిని వెంటనే కిందకు తీసివేశారు. అలాగే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. సుమారు ఆరు వేల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

రాయపురాజుపేటలో మట్టి తవ్వకాలు

» ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ని పట్టుకున్న పోలీసులు

చోడవరం, ఫిబ్రవరి 6: మండలంలోని రాయపురాజుపేటలో అక్రమంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న ఎక్స్‌కవేటర్‌తోపాటు ట్రాక్టర్‌ని మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. గ్రామం పరిధిలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారంటూ అందిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కి తరలించారు.

మంచు ప్రభావంతో అపరాల పంటకు దెబ్బ

మాకవరపాలెం, ఫిబ్రవరి 6: మండలంలో మూడు రోజులుగా మంచు దట్టంగా కురుస్తోంది. వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకూ ఇదే వాతవరణం కనిపిస్తోంది. దీంతో వివిధ పనులకు బయటకు వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. వేకువ జాము నుంచి ఉదయం పది గంటల వరకు లైట్లు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. ఈ పొగమంచు వల్ల అపరాల పంటలైన మినప, పెసర, బొబ్బర పంటలకు తీవ్ర నష్టమని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే అపరాల పంటలు పూత దశకు రావడంతో పొగమంచు వల్ల పూత మాడిపోతుందని రైతులు చెబుతున్నారు.



అపరాల పంటపై పడుతున్న మంచు

ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్ డీజీనాథ్‌కు సన్మానం



డీజీ నాథ్‌ని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ అధ్యక్షుడు వరహాలనాయుడు

నర్సీపట్నం, ఫిబ్రవరి 6 : ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్‌గా డీజీనాథ్ సోమవారం ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం పీఆర్‌టీయూ నర్సీపట్నం, గొలుగొండ మండల శాఖల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆయనకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీజీనాథ్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దుకు కృషి చేస్తానని అన్నారు. ఏపీజీఎల్ఐ బకాయిలు వెంటనే విడుదల చేసే విధంగా ప్రభుత్వంతో మాట్లాడతానన్నారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం, గొలుగొండ పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆడిగర్ల వరహాలనాయుడు, కార్యదర్శి జీవీ.రమేష్, శ్రీరామమూర్తి, రమణమూర్తి, కురచా రమణ, ఎంఎస్ ప్రసాద్, అల్లు అప్పారావు, బాబీ మాస్టారు పాల్గొన్నారు.

భూహక్కుల చట్టానికి వ్యతిరేకంగా న్యాయవాదుల వంటా-వార్పు



వంటా-వార్పుతో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 6 : ఏపీ భూహక్కుల చట్టం-27కు వ్యతిరేకంగా నర్సీపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం వంటా-వార్పు నిరసన చేపట్టారు. భూహక్కుల చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు 70 రోజులుగా కోర్టు సముదాయం ముందు రిలే దీక్షలు చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం వంటా-వార్పు నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ సత్యనారాయణ, కార్యదర్శి లోకా లోవరాజు, కామిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ జయరాంను కలిసిన ఎంపీడీఓ

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 6: నర్సీపట్నం ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన జాన్‌లింకన్ మంగళవారం ఆర్డీఓ జయరాంను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ జయరాంకు పుష్పగుచ్ఛం ఇచ్చి, పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో జయరాం మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా విధులు నిర్వహించాలని ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓ రమణబాబు పాల్గొన్నారు.



ఆర్డీఓ జయరాంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీడీఓ కె.జాన్ లింకన్

వైసీపీ నేతలు బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

వైసీపీ నాయకులు దీనిని ఏర్పాటు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని రామాలయం గోడకు ఎలా బిగించారని పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ ఇంజినీరింగ్ అధికారులను అడిగితే ఎవరికి వారు తమకు సంబంధం లేదని తప్పించుకుంటున్నారని, దీనికి కారకులైన వారిపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని తెలుగుయువత జిల్లా నాయకుడు దేవరపల్లి రవికుమార్ డిమాండ్ చేశారు. వైసీపీ నాయకుల చర్య హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వుందని ఆయన ఆరోపించారు.

కాగా ఎం.కొత్తపల్లిలో రామాలయం గోడకు సీసీ రోడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని బిగించడంపై పంచాయతీరాజ్ డీఈఈ జీఎస్ఎస్ ప్రసాద్‌ను వివరణ కోరగా, ఈ విషయం తన దృష్టికి రాలేదని, సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని రామాలయం గోడకు బిగించాలని తాము ఎవరికీ అనుమతి ఇవ్వలేదు.

రాద్ధాంతం చేస్తున్నారు

పల్లా నరసింగరావు, డీసీఎంఎస్ చైర్మన్, గంధవరం

ఎం.కొత్తపల్లిలో రామాలయం గోడకు సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకం అతికించలేదు. ఆలయం గోడకు దగ్గరగా వేరే దిమ్మ కట్టి, దానికి బిగించాం. ఆలయంలో అభివృద్ధి పనులను పంచాయతీ పాలకవర్గం చేపట్టినందున రామాలయం గోడకు పంచాయతీ పాలకవర్గం పేర్లతో శిలాఫలకం పెట్టాం. దీనిని అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారు.

సర్వర్ సమస్యతో మందకొడిగా ఇళ్ల రిజిస్ట్రేషన్లు

పాయకరావుపేట, ఫిబ్రవరి 6 : మండలంలోని జగనన్న ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు సర్వర్ సమస్యతో మందకొడిగా జరుగుతున్నాయి. పాయకరావుపేట పట్టణంలో సచివాలయం-1లో మంగళవారం సర్వర్ పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన లబ్ధిదారులు సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. మండలంలోని 24 పంచాయతీల పరిధిలో 18 జగనన్న ఇళ్ల కాలనీల లేఅవుట్లు వేశారు. ఇందులో 2,952 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. పాయకరావుపేట పట్టణంలో 1,250 మందికి పీఎల్.పురం పంచాయతీ శివారులో ఇళ్ల పట్టాలు ఇచ్చిన విషయం తెలిసిందే. మండలంలో ఇప్పటి వరకు 1,300 ఇళ్ల పట్టాలు వీఆర్వోల లాగిన్‌లోకి రావడంతో వీరందరికీ సంపూర్ణ హక్కు కల్పించడం కోసం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అయితే సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జాప్యం జరుగుతోంది. సర్వర్ సక్రమంగా పనిచేస్తే ఒక్కో ఇళ్ల పట్టా రిజిస్ట్రేషన్‌కు 15 నిమిషాలు పడుతుండగా, సర్వర్ పనిచేయకుంటే ఖాళీగా కూర్చోవలసి వస్తోంది. ఈ విషయమై ఈవోపీఆర్డీ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. మండలంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు సర్వర్ పనిచేయకపోవడం సమస్యగా ఉందన్నారు. ఇప్పటివరకు మండలంలో 549 రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు.

చోడవరం నియోజకవర్గం

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా గూనూరు వెంకటరావు



గూనూరు వెంకటరావు

చోడవరం, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు గూనూరు వెంకటరావు నియమితులయ్యారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు వెంకటరావును నియమిస్తూ ఏపీ కాంగ్రెస్ మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కాగా తనకు ఈ బాధ్యతలు అప్పగించిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్యం ఠాకూర్‌కు వెంకటరావు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

గవరవరంలో బెల్టు దుకాణంపై దాడి

» 13 మద్యం సీసాలు స్వాధీనం.. ఇద్దరిపై కేసు



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

చోడవరం, ఫిబ్రవరి 6: మండలంలో గవరవరం గ్రామంలోని బెల్టు దుకాణంపై మంగవారం పోలీసులు దాడులు చేశారు. పాన్ షాపు ముసుగులో ఆదుర్తి సోమరాజు అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి, 13 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. అలాగే చోడవరం పీఎస్ పేట రోడ్డులోని ఆటోస్టాండ్ వద్ద బెన్నవోలు గ్రామానికి చెందిన సేనాపతి రమణ అనే వ్యక్తి నుంచి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని, అతనిపై కూడా కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలే లక్ష్యం: జడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 6: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే ఆరోగ్య సురక్ష పథకం లక్ష్యమని జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు అన్నారు. మంగళవారం కందిపూడిలో జరిగిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చెయ్యపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటసాయి కృష్ణ, ఎంపీడీవో వెంకటాచార్యులు, తహసీల్దార్ శ్రీకాంత్, సర్పంచ్ కొప్పాక సత్యవతి పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మా గోడు పట్టడం లేదు..

» లైసెన్స్‌డ్ సర్వేయర్ల ఆందోళన

» టీడీపీ అధినేత చంద్రబాబుకు వినతిపత్రం



విలేకరులతో మాట్లాడుతున్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘ నాయకులు

చోడవరం, ఫిబ్రవరి 6: ప్రభుత్వానికి తమ గోడు పట్టడం లేదని లైసెన్సుడు సర్వేయర్ల అసోసియేషన్ సంఘం జిల్లా నాయకులు పీసీహెచ్ కె.రాజు, పాము గోవిందరాజు, వరప్రసాద్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సోమవారం కెకోటపాడు గొండుపాలెం సభకు వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. లైసెన్సుడు సర్వేయర్లకు ప్రస్తుత ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాన్ని చంద్రబాబుకు వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన లైసెన్సుడు సర్వేయర్ల వ్యవస్థలోకి ప్రభుత్వం ద్వారా శిక్షణ పొంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మరీ సర్వే అండ్ సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డు కమిషన్ వారి ద్వారా లైసెన్సులు పొందామని బాబుకు తెలిపారు. అప్పటి నుంచి ప్రభుత్వానికి ప్రతి మూడేళ్లకు రూ.5 వేలు చెల్లిస్తూ తమ లైసెన్సులు రెన్యువల్ చేసుకుటున్నామని, రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. నామమాత్రపు రుసుములతో తమ కుటుంబాలు నడిపించుకుంటూ జీవనం సాగిస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం హయాంలో ఏర్పాటయిందన్న ఉద్దేశ్యంతో ప్రస్తుత ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోవడం లేదని, తమను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించాలంటూ ఇచ్చిన ఆదేశాలు కూడా అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 నుంచి పెట్టుకున్న లైసెన్సు రెన్యువల్ చేయకుండా తమను గాలిలో ఉంచేశారని వారు చంద్రబాబు ఎదుట వాపోయారు. తమ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని చంద్రబాబుకు వారు విన్నవించారు.

రా.. కదలిరా కార్యక్రమం సూపర్ సక్సెస్

» చంద్రబాబు సభకు వచ్చిన జనాదరణ చూసి వైసీపీ నేతల మైండ్ బ్లాక్

» టీడీపీ, జనసేన నాయకులు పుప్పాల అప్పలరాజు, రొబ్బా మహేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ, జనసేన నాయకులు

మాడుగుల, ఫిబ్రవరి 6: రా.. కదలిరా చంద్రబాబు సభ సూపర్ సక్సెస్ అయ్యిందని, ఆ సభకు వచ్చిన ప్రజాదరణ చూసి వైసీపీ నాయకులకు మైండ్ బ్లాకైందని టీడీపీ మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి రొబ్బా మహేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం టీడీపీ, జనసేన పార్టీ నాయకులు కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కె.కోటపాడు మండలం గొండుపాలెంలో సోమవారం నిర్వహించిన రా.. కదలిరా చంద్రబాబు నాయుడు సభకు నాయకులు, కార్యకర్తలు, రెండు పార్టీల కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా రావడంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సభ విజయవంతం కావడం జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు టీడీపీ, జనసేన ఉమ్మడిగా నిర్వహించిన రా.. కదలిరా కార్యక్రమానికి అసలు ప్రజలే రాలేదని తప్పుడు సంకేతాలను పంపించేలా పోస్టింగ్‌లు పెట్టడం దారుణమన్నారు. గతంలో ఘాట్ రోడ్డు జంక్షన్‌లో జరిగిన బస్సుయాత్ర పోటో, వీడియోలను అప్‌లోడ్ చేస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. వైసీపీ నాయకుల మాదిరిగా డ్వాక్రా మహిళలకు, సచివాలయ ఉద్యోగులు. వలంటీర్లను ప్రలోబాలకు గురిచేయలేదని, వచ్చిన వారికి బిర్యానీ ప్యాకెట్లు, మద్యం పంపిణీ చేయలేదని, అందరూ స్వచ్ఛందంగా వచ్చారని వారు పేర్కొన్నారు. వైసీపీ ఓటమి అర్థమైపోయిన నాయకులు, ఆ భయంతో మతి భ్రమించి ఏం చెయ్యాలో తోచక ఏదేదో అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. వైసీపీ ఓటమి చూసేంత వరకు ప్రతీ ఒక్కరూ కష్టించి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాడుగుల అధ్యక్షుడు వద్దాది రంజిత్‌వర్మ, బీసీ సెల్ జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి లెక్కల కాశిబాబు, రాజ్‌కుమార్, జనసేన పార్టీ అధ్యక్షుడు ఇళ్లపు రమేష్, నాయకులు పుప్పాల రమేష్, సూర్యనారాయణరాజు, శ్రీమూర్తి, జల్లి సూర్య ప్రకాష్, రాకేటి నూకారాజు, దర్శిశెట్టి అప్పలరాజు, పిల్లా సోమేష్ పాల్గొన్నారు.

పాడి రైతు సంక్షేమమే విశాఖ డెయిరీ ధ్యేయం

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 6: పాడి రైతు సంక్షేమమే విశాఖ డెయిరీ లక్ష్యమని డైరెక్టర్ గేదెల సత్యనారాయణ అన్నారు. కోమళ్లపూడిలో చనిపోయిన పాడి పశువుకు మంజూరైన రూ.51 వేల బీమా చెక్కును బాధిత రైతు గొన్నా నల్లంనాయుడుకు మంగళవారం అందచేశారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ అమలు చేస్తున్న సంక్షేమ కార్యకమాలను సత్యనారాయణ వివరించారు. పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డెయిరీ మేనేజరు ఎస్.ప్రసాద్, కార్యదర్శి గొన్న ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు వి.అర్జునఅప్పారావు, ఎన్నెంశెట్టి అచ్చెంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంకే పట్నం వీఆర్వోపై సమగ్ర విచారణ

» ఆర్డీవో జయరాం

రోలుగుంట, ఫిబ్రవరి 6: ఎంకే పట్నం గ్రామ రెవెన్యూలో రీ సర్వే, భూమి ఆన్‌లైన్ తదితర అంశాలపై అవకతవకలు జరిగాయని వీఆర్వో రాజులమ్మపై రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో జయరాం తెలిపారు. మంగళవారం సాయంత్రం మండల రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వో రాజులమ్మ రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల జారీపై అధిక మొత్తంలో వసూళ్లు చేసిన ఆరోపణలపై మూడు నుంచి నాలుగు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిపై గత తహసీల్దార్ కూడా విచారణ చేపట్టి నివేదిక ఇచ్చారన్నారు. రోలుగుంట మండలానికి సంబంధించి ప్రస్తుతం ఆరు గ్రామాల్లో రీసర్వే జరుగుతుందన్నారు. రెండు, మూడు గ్రామాల్లో డీఎల్ఆర్ దశలో ఉన్నాయన్నారు. రీ సర్వేలో జరిగిన తప్పుల సవరణకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారుల ఇళ్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తిచేసి పత్రాలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిచంద్ర, డీటీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బూడి విమర్శలతో మాడుగుల ప్రజలకు తలవొంపులు

» టీడీపీ నియోజకవర్గ నాయకుడు పైలా ప్రసాదరావు



మాట్లాడుతున్న టీడీపీ నేత ప్రసాదరావు, పక్కన కార్యకర్తలు

కె.కోటపాడు, ఫిబ్రవరి 6: మాడుగుల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణ, రా కదలి రా సభకు స్వచ్ఛందంగా తరలివచ్చిన జనసందోహాన్ని చూసి ఓర్వలేక మంత్రి బూడి ముత్యాలనాయుడు మతిభ్రమించి మాట్లాడుతున్నారని పార్టీ నియోజకవర్గం నాయకుడు పైలా ప్రసాదరావు ఆరోపించారు. మాడుగుల ప్రజలకు మంత్రి విమర్శలు తలవొంపులు తెచ్చాయని పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధిలో ఎన్నో మైలురాళ్లు సాధించిన చంద్రబాబును విమర్శించే కనీస నైతిక అర్హత బూడికి లేదన్నారు. మంత్రిగా రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాల్సిన ముత్యాలనాయుడు తారువ గ్రామానికే పరిమితం కావడం సిగ్గుచేటన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల మనసులు గెలిచిన మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుపై ఇష్టానుసారంగా దూషణలు చేయడం బూడి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, నాయకులు డి.నరసింహమూర్తి, సూర్యనారాయణ, పి.నారాయణమూర్తి, వి.పైడంనాయుడు, బి.దేముడుబాబు, భూపతి అప్పలరాజు పాల్గొన్నారు.

మంత్రి బూడికి మతిభ్రమించింది: ఎరుకునాయుడు

కె.కోటపాడు, ఫిబ్రవరి 6: గొండుపాలెంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సభకు వచ్చిన జనాన్ని చూసి మంత్రి బూడి ముత్యాలనాయుడు మతిభ్రమంచి మాట్లాడుతున్నారని ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నేత దాడి ఎరుకునాయుడు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌లను విమర్శించే స్థాయి బూడికి లేదన్నారు. గొండుపాలెం తెలుగుదేశం సభ హాజరైన జనాన్ని చూసి ఇక గెలవలేమన్న విషయం బూడి ముత్యాలనాయుడుకు అర్థమైందని, అందుకే ఇలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. తెలుగుదేశం, జనసేన కూటమితో వైసీపీ బంగాళాఖాతంలో కలవడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చెల్లపల్లి శ్రీనివాసు, మల్లు గోవింద, జనసేన నేత మారపరెడ్డి శివ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహనకు మాక్ ఓటింగ్

రావికమతం, ఫిబ్రవరి 6: మండలంలోని ములకలపల్లి, చీమలపాడు గ్రామాల్లో ఈవీఎం యంత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రెవెన్యూ అధికారులు మంగళవారం మాక్ ఓటింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఆర్ఐ సతీష్, వీఆర్ఓలు, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంలో ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు వేసిన గుర్తుకు పడిందా? లేదా? అనేది ప్రయోగాత్మకంగా చూపించి, ప్రజల అనుమానాలను నివృత్తి చేశారు.

మాడుగుల నియోజకవర్గం

132 మందికి వైద్య సేవలు



ప్రత్యేక వైద్య శిబిరానికి హాజరైన రోగులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 6: పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జీనబాడు, దేవరాపల్లి జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో 132 మంది వైద్య సేవలు పొందారు. పినకోట వైద్యాధికారి జి.వెంకటేష్, దేవరాపల్లి వైద్యాధికారి పూజిత మేఘన వారికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. 28 మందికి కంటి పరీక్షలు జరపగా, 23 మందికి కంటి అద్దాలు ఇవ్వడానికి గుర్తించామని ఆప్తాలమిక్ అధికారి రమణబాబు తెలిపారు. ప్రత్యేక వైద్యులు ఎస్.అప్పారావు, కె.ముసిసౌమ్య, పంచాయతీ కార్యదర్శి బి.ఉమాదేవీ, ఎంపిహెచ్ఈవో గంగరాజు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీదేవి, పార్మసిస్ట్ అశ్విని, కె.పుష్ప, కె.తులసి, జయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణ స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి

చీడికాడ, ఫిబ్రవరి 6: గృహ నిర్మాణ స్థలాల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయించాలని మాడుగుల సబ్ రిజిస్ట్రార్ ఎం.పురుషోత్తం సూచించారు. ఖండివరం సచివాలయంలో హౌసింగ్ స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖండివరం సచివాలయ పరిధిలోని 118 ఇళ్ల స్థలాలకుగాను ఇప్పటికే 80 స్థలాల రిజిస్ట్రేషన్ పూర్తయినట్టు చెప్పారు. మిగతా స్థలాలు రిజిస్ట్రేషన్ రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.వీర్రాజు, వీఆర్వో రెడ్డి ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీడి రైతుల సమస్యలపై ఆందోళన

దేవరాపల్లి, ఫిబ్రవరి 6: జీడి పంటకు గిట్టుబాటు ధర ప్రకటించాలని, ప్రభుత్వమే రైతుభరోసా కేంద్రం ద్వారా కొనుగోలు చేయాలన్న డిమాండ్‌తో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన కార్యక్రమం చేపడతామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.టి.దొర తెలిపారు. మంగళవారం జీడి రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార వాణిజ్య పంటలకు మద్దతు ధర ప్రకటిస్తాయని, కాని జీడి పంటకు మాత్రం ప్రకటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా చేపట్టే ఆందోళన కార్యక్రమానికి ప్రతీ ఇంటి నుంచి తరలిరావాలని కోరారు.

స్పృహ తప్పి ఒకరి మృతి

కె.కోటపాడు, ఫిబ్రవరి 6: అనకాపల్లిలోని సుందరయ్యపేటకు చెందిన లారీ డ్రైవర్ బొద్దపు శ్రీను (35) స్పృహ తప్పి మృతి చెందాడు. చంద్రబాబు సభా ప్రాంగణానికి కొద్ది దూరంలో ఆయన స్పృహ తప్పి పడిపోయాడు. అతన్ని చూసిన వారు అంబులెన్స్‌కు ఫోన్ చేయగా, సిబ్బంది వచ్చి పరిశీలించారు. అప్పటికే మృతి చెందాడని వారు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా కోదండరామాంజనేయ తీర్థం

చీడికాడ, ఫిబ్రవరి 6: మండలంలోని ఖండివరం గ్రామంలో మంగళవారం శ్రీకోదండరామ ఆంజనేయస్వామి తీర్థం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా స్థాయి ఎడ్లపరుగుపోటీలు నిర్వహించగా, 15 జతలు పాల్గొన్నాయి. ఏడుగురు విజేతలకు గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతులను అందించారు. అనంతరం గ్రామంలో కోలాటాలను ఘనంగా నిర్వహించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అలాగే మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో బుధవారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు సర్పంచ్ చుక్క అప్పలనాయుడు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు.

